Follow: @ANNTELUGU
26-03-2025
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 114 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్

**మహా:** ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన హై స్కోరింగ్ థ్రిల్లర్‌లో 11 పరుగుల తేడాతో పంజాబ్ విజయం సాధించింది. 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టీమ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. గుజరాత్ బ్యాటర్లలో సాయిసుదర్శన్(74), జోస్ బట్లర్(54) రూథర్ ఫర్డ్(46) పోరాడినప్పటికి తమ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్(33) తన వంతు ప్రయత్నం చేశాడు. కానీ కొండంత లక్ష్యాన్ని కరిగించలేకపోయారు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ రెండు, జానెసన్, మాక్స్‌వెల్ తలా వికెట్ సాధించారు.

మిగతా 8లో

**టాప్ న్యూస్**


### జగ్గారెడ్డి జయలక్ష్మి ఫిలింస్



- ఇక జూబ్లీహిల్సే అడ్డా
- ఇక సిన్మాపైనే కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ ఫోకస్

03

### సోషల్ మీడియాలో కోతిరాముళ్ళు



- గోకా నాకా అన్నట్లు చేస్తున్నరు
- మా నాయకుడు.. నా ఇష్టం.. మీకేం తీట
- అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలపై వేముల వీరేశం ఫైర్

02

### ఈ సమయంలో అందాల పోటీలు అవసరమా?



- వేసవి సమయంలో నీటి ఎద్దడి నివారణపై చర్యలు చేపట్టండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



### మంత్రి గారూ.. నమస్కారం

- వివేక్ ను పలకరించిన మల్లారెడ్డి
- ఇపుడు వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హవా నడుస్తోందన్న మల్లారెడ్డి
- కేసీఆర్, మల్లారెడ్డి కుటుంబాల హవా కూడా నడిచిందన్న వివేక్

వివరాలు 2లో



### హోం శాఖ అంటే ఇష్టం

- ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తా..
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

వివరాలు 2లో



### క్యాన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు!

- కోరిక నెరవేర్చి క్రికెట్ కిట్ అందజేసిన మంత్రి
- అన్నగా అండగా ఉంటానని భరోసా

వివరాలు 3లో

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో రెండో మృతదేహం లభ్యం

మరో ఆరింటికోసం గాలింపు ముమ్మరం

వివరాలు 2లో

# ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణం



## ప్రస్తుత విస్తరణలో నలుగురి అవకాశం

పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు.. వివేక్ కు విద్యాశాఖ?

సుదర్శన్ రెడ్డి లేదా రాజగోపాల్ రెడ్డికి హోం? .. శ్రీహరికికి పశుసంర్ధక, డెయిరీ డెవలప్ మెంట్?

తొలగింపులు లేవు.. పనితీరు సరిగాలేనివారికి వార్నింగ్ లే

విస్తరణతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలకు కీలక పదవులు.. ఎమ్మెల్సీ లకు నో ఛాన్స్

"తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం ఏప్రిల్ 3న కేబినెట్ విస్తరణ జరగనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈనెలలోనే ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రక్రియ పూర్తిచేయాలని అధిష్టానం భావించినా, 31న రంజాన్ పర్వదినం కావడంతో ముహూర్తం వాయిదాపడ్డట్లు తెలుస్తోంది. నాలుగు బెర్త్ లకు సంబంధించి ఏకాభిప్రాయం వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుత మంత్రివర్గం నుండి ఎవరినీ తొలగించకూడదని, కొత్తవారి శాఖల సర్దుబాటు కోసం అవసరమైతే స్వల్ప మార్పులు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

- మహా, హైదరాబాద్"



వివరాలు 2లో



# భద్రాచల క్షేత్రానికి ఇక వైభవం

**దక్షిణ అయోధ్యపై ముఖ్యమంత్రి రేవంత్ దృష్టి**


గత బీఆర్ఎస్ సర్కారు చిన్నచూపు.. టెంపుల్ సిటీకి సీఎం రేవంత్ గ్రీన్ సిగ్నల్

భద్రాద్రి రామయ్య భక్తుల హర్షాతిరేకాలు

భూసేకరణ ఘట్టం ఆరంభం.. మహోన్నత క్షేత్రం కోసం రూ.34 కోట్లు మంజూరు.

రామాలయ విస్తరణకు ఊతమిచ్చిన సీఎం రేవంత్

**భద్రాచలం, ఖమ్మంమహా:** భద్రగిరి మళ్ళీ పూర్వవైభవం సంతరించుకోనుంది. దక్షిణ అయోధ్యపై అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళు నిర్లక్ష్యం ప్రదర్శించి వెనుకపడేయగా, ఇపుడు మళ్ళీ ఆలయ ప్రగతిపై ఆశలు చిగురిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో భద్రాద్రి రామయ్య భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, భద్రాద్రిని భవ్య ఆలయ నగరంగా తీర్చిదిద్దేందుకు రూ.34 కోట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రామయ్యకు ముఖ్యమంత్రి రేవంత్ భక్తరామదాసులా నిలబడుతున్నారని, విస్తరణ పనులు పర్యవేక్షిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ధన్యవాదాలు చెబుతున్నారు.



### 13 గంటల పాటు కొనసాగిన అసెంబ్లీ

- మారథాన్ సెషన్స్.. ఎంత సేపు చర్చకైనా రెడీ అంటున్న అధికారపక్షం
- రాత్రి 11 గంటల వరకు కొనసాగిన శాసన సభ సమావేశాలు

02

## విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తాం

**విద్యా కమిషన్ సూచనల మేరకు బాగుచేస్తాం**

**రూ.11,600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు**

**అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహ**



**హైదరాబాద్, మహా:** విద్యా కమిషన్ సూచనల మేరకు విద్యా వ్యవస్థను బాగుచేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. స్కూల్‌లో ఉన్న పిల్లల గురించి ఇంటిదగ్గర ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందే పరిస్థితులు ఉండకూడదని చెప్పారు. విద్యాశాఖ బడ్జెట్ పద్దుపై అసెంబ్లీలో మంగళవారం చర్చ జరిగింది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానం ఇచ్చారు.

మిగతా 2లో

## పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం

- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- విచారణ ఏప్రిల్ 2కు వాయిదా
- గత కేసులపై ధర్మాసనం వ్యాఖ్యలు

**మహా :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు తగిన సమయం అని చెప్పలేదని, అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది.



మిగతా 2లో

### బెట్టింగ్ యాప్స్ కేసు

దూకుడు పెంచిన మియాపూర్ పోలీసులు
పలు కంపెనీలపై కేసులు నమోదు

వివరాలు 3లో

### ప్రభుత్వ విజయోత్సవాలు నెలరోజులు ధూంధాం

ఏప్రిల్ 5 నుంచి నెలాఖరు వరకు పలు జిల్లాల్లో భారీ బహిరంగ సభలు

వివరాలు 3లో

# ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణం



## ప్రస్తుత విస్తరణలో నలుగురి అవకాశం

పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు.. వివేక్ కు విద్యాశాఖ?
సుదర్శన్ రెడ్డి లేదా రాజగోపాల్ రెడ్డికి హోం? .. శ్రీహరికికి పశుసంర్ధక, డెయిరీ డెవలప్ మెంట్?
తొలగింపులు లేవు.. పనితీరు సరిగాలేనివారికి వార్నింగ్ లే
విస్తరణతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలకు కీలక పదవులు.. ఎమ్మెల్సీ లకు నో ఛాన్స్



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం ఏప్రిల్ 3న కేబినెట్ విస్తరణ జరగనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈనెలలోనే ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రక్రియ పూర్తిచేయాలని అధిష్టానం భావించినా, 31న రంజాన్ పర్వదినం కావడంతో ముహూర్తం వాయిదాపడ్డట్లు తెలుస్తోంది. నాలుగు బెర్త్ లకు సంబంధించి ఏకాభిప్రాయం వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుత మంత్రివర్గం నుండి ఎవరినీ తొలగించకూడదని, కొత్తవారి శాఖల సర్దుబాటు కోసం అవసరమైతే స్వల్ప మార్పులు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. కోర్ కమిటీ నుండి ఒక ప్రతిపాదన, ఏఐసిసి ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నుండి ఒక ప్రతిపాదన తీసుకుని హైకమాండ్ పెద్దలు అంశాలవారీగా చర్చించి.. గతంలో ఇచ్చిన హామీలు, పార్టీ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ కసరత్తు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. పాలమూరు, నల్లగొండ జిల్లాలకు తాజా విస్తరణ ద్వారా మూడో మంత్రి పదవి దక్కబోతుండగా.. తొలిసారి ఆదిలాబాద్, నిజామాబాద్ లకు కేబినెట్ లో చోటు దక్కబోతున్నది. సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి కోం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా పట్టుబట్టి సాధించగా, వాకిటి శ్రీహరికి అందరూ ఏకాభిప్రాయంతో ఓకే చేసినట్లు తెలుస్తోంది. వివేక్, రాజగోపాల్ రెడ్డికి హైకమాండ్ గతంలో ఇచ్చిన హామీనే ప్రాతిపదికగా చెబుతున్నారు. ప్రస్తుతం మంత్రివర్గం నుండి ఎవరినీ తొలగించే అవకాశం లేదని, పలువురు మంత్రుల శాఖల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లు ఢిల్లీవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతానికి ఎమ్మెల్సీలను కేబినెట్ లోకి తీసుకోవొద్దన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

### కీలకశాఖలు

ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద మునిసిపల్ అర్బన్ డెవలప్ మెంట్, హోం, విద్యాశాఖలు ఉండగా, కొందరు మంత్రుల వద్ద రెండు, మూడు కీలక శాఖలు ఉన్నాయి. హౌజింగ్, ఐ అండ్ పిఆర్, చేనేత, విద్యుత్ వంటి శాఖల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నట్లు వినడుతోంది. ప్రస్తుతం సీఎం వద్ద ఉన్న వాటిలో విద్యాశాఖ వివేక్ కు కేటాయించవచ్చని, హోం సుదర్శన్ రెడ్డికి, రాజగోపాల్ రెడ్డికి హౌజింగ్ దక్కవచ్చన్న ప్రచారాలు జరుగుతున్నాయి. వాకిటి శ్రీహరికి దేవాదాయ లేదా పశుసంవర్ధక, డెయిరీ డెవలప్ మెంట్ దక్కే అవకాశాలున్నట్లు వినబడుతోంది. శాఖలకు సంబంధించి కూడా హైకమాండ్ తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్ పార్టీలో ఆఖరి నిమిషం వరకు ఏమైనా జరగొచ్చనే చర్చ ఉంటుంది.

### షార్ట్ లిస్ట్ పరిస్థితేంటి?

కేబినెట్ లో మరో రెండు ఖాళీలు ఉండే అవకాశముండగా, కేబినెట్ బెర్త్ ను బలంగా ఆశిస్తున్న ప్రేమ్ సాగర్ రావు, మదన్ మోహన్ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి, బాలూ నాయక్, ఆది శ్రీనివాస్, రామచంద్రనాయక్ , బీర్ల ఐలయ్య లకు అధిష్టానం ఏ విధంగా సర్దుబాటు చేస్తుందన్నది చర్చనీయాంశంగా ఉంది. సీనియర్ ఎమ్మెల్యేలకు కీలక కార్పోరేషన్లు, నామినేటెడ్ బోర్డులు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బాలూనాయక్ కు డిప్యూటీ స్పీకర్ , మల్ రెడ్డి రంగారెడ్డి లేదా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి చీఫ్ విప్ ఇచ్చే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాల ఇన్ ఛార్జి మంత్రుల్లోనూ మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు, జీహెచ్ ఎంసి ఎన్నిలను పరిగణనలోకి తీసుకుని ఈ మార్పులు చేర్పులు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

# పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

### విచారణ ఏప్రిల్ 2 కు వాయిదా.. గత కేసులపై ధర్మాసనం వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)



ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరవున సీనియర్ న్యాయవాది అరియామా వాదనలు వినిపిస్తూ ముగ్గురు ఎమ్మెల్యేపై వేరు వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని, నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి ధర్మాసం దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని, అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రిప్లై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని, ఆ మూడు వారాలు, నోటీసులు ఎటు వెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని, ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా అని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నవ్వుతూ అన్నారు.

స్పీకర్ క్వాషి జ్యూడిషియరీ అధికారాలతో ఉన్నారని, రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అలాంటి సందర్భంలో..రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదు కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్న న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌ను తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాది సుందరం మాట్లాడుతూ, తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుందని, కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని, నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో అనర్హత వేటు పడిందని ఆర్యామ సుందరం వెల్లడించారు. మరో కేసులో తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుందని చెప్పిందంటూ పాడి కౌశిక్ రెడ్డి తరపున న్యాయవాది అరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది.

బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ తరపు వాదనలు ముగియగా తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. ఏప్రిల్ 2న స్పీకర్,అసెంబ్లీ సెక్రటరీ తరపు న్యాయవాదులు కౌంటర్ వాదనలు వినిపించనున్నారు.

# విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తాం

**విద్యా కమిషన్ సూచనల మేరకు బాగుచేస్తాం**
**రూ.11,600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు**
**అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహ**

(మొదటిపేజీ తరువాయి)



గత ఏడెనిమిదేళ్లుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని..ఇది మంచి పరిణామం కాదని చెప్పారు. 662 రెసిడెన్షియల్ స్కూళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని అన్నారు. సుమారు 2 లక్షల మంది విద్యార్థులు అరకొర వసతులతోనే చదువుకొంటున్నారని చెప్పారు. స్కూళ్లు మంజూరు చేయడం మంచిదే.. కానీ వసతులు కూడా కల్పించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతూ పాఠశాలలకు పంపించే పరిస్థితి ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. స్కూల్‌లో ఉన్న పిల్లల గురించి ఇంటిదగ్గర ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందే పరిస్థితులు ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. అన్ని స్కూళ్లలో అవసరమైన దిద్దుబాటు చర్యలు ప్రారంభించామని అన్నారు. విశాల తరగతి గదులు, ల్యాబులు, తాగునీటి వసతి, క్లీన్ వాష్ రూమ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ టీచర్లంతా మెరిటోరియస్.. వారు తాము పనిచేసే విద్యా సంస్థలను ఓన్ చేసుకోవాలని సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను రూ.11,600 కోట్లతో ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎడ్యుకేషన్ కమిషన్ సూచనల మేరకు విద్యా వ్యవస్థను బాగు చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. 11 వేలకు పైగా టీచర్లను భర్తీ చేశామని ఉద్ఘాటించారు. 12 యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తుచేశారు. కొత్త కోర్సులను పరిచయం చేశామని తెలిపారు. పిల్లల పాఠశాలల పెంచేందుకు, ఎంఎన్‌సీ కంపెనీలు, విదేశీ యూనివర్సిటీలతో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలు ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. యూనివర్సిటీల్లో డిటెన్షన్, డ్రాపౌట్స్, మల్టీపుల్ ఎంట్రీస్, మల్టీపుల్ ఎగ్జిట్స్, కామన్ సిలబస్, అంశాలపై చర్చించేందుకు ఇదివరకే కమిటీ వేశామని చెప్పారు. కమిటీ నివేదిక వచ్చాక అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. త్వరలో ఫీజు రెగ్యులేటరీ కమిటీని నియమిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.



# హోం శాఖ అంటే ఇష్టం

- **ఏ పదవి వచ్చినా సమర్ధవంతంగా నిర్వహిస్తా..**
- **ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**


**మహా:** మంత్రి పదవిపై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి వస్తదనుకుంటున్నట్లు చెప్పారు. అయితే తనకు హోంశాఖ అంటే ఇష్టమని అన్నారు. ఏ పదవి వచ్చినా సమర్ధవంతంగా నిర్వహిస్తా.. ప్రజల పక్షాన నిలబడతానని చెప్పారు. కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలన్నారు. నాకు భువనగిరి బాధ్యత ఇస్తే సమర్థంగా నిర్వహించా. కేబినెట్ విస్తరణపై ఢిల్లీలో సీరియస్ గానే చర్చ జరిగినట్లు ఉందన్నారు. అయితే తనకు ఇప్పటి వరకు ఢిల్లీ నుంచి ఎలాంటి ఫోన్ రాలేదని చెప్పారు రాజ్ గోపాల్ రెడ్డి. త్వరలో కానున్న కేబినెట్ విస్తరణలో రాజ్ గోపాల్ రెడ్డికి మంత్రి పదవి వస్తదనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో రాజ్ గోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## సోషల్ మీడియాలో
# కోతిరాముళ్ళు
## గోకా నాకా అన్నట్లు చేస్తున్నరు

**మా నాయకుడు.. నా ఇష్టం.. మీకేం తీట**
**అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలపై వేముల వీరేశం ఫైర్**



**హైదరాబాద్, మహా:** నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఓ రేంజ్ లో రెచ్చిపోయారు. అసెంబ్లీ దగ్గర మీడియాతో జరిపిన చిట్ చాట్ లో ఆయన తన ప్రత్యర్థిపై పరోక్షంగా సెటైర్లు వేశారు. " సోషల్ మీడియాలో కొందరు కోతి రాముళ్ళు ఉన్నారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికితే గోకా.. నాకా అన్నట్లు ఉంది వాళ్ళ వ్యవహారం. ఆ కోతి రాముడు ఎవరో సందర్భం వచ్చినప్పుడు చెప్తా. అది అసలే కోతి... కళ్ళు తాగింది.. ఇష్టా రీతిలో మాట్లాడుతోంది. దళితులు అంటే వారికి ఈర్ష్య... స్వతంత్రంగా నిలబడితే తట్టుకోలేకపోతున్నారు. గతంలో వాళ్లకు లీక్‌ల అలవాటు ఉంది." అంటూ ఓ రేంజ్ లో ఆడుకున్నారు ఎమ్మెల్యే వీరేశం. "వాళ్లకు లీక్‌లు అంటే ఇష్టం.పల్లీ బఠానీలకు పేపర్లు అమ్ముకుంటారు. చదువు విలువ మాకు తెలుసు. చదువుకునే వారి జీవితాలను పల్లీ బఠానీలకు అమ్ముకున్నారు. దమ్ముంటే డైరెక్ట్ గా ఎదుర్కోవాలి. వాళ్లకు అనుమానాలు ఉంటే సభలో లేవనెత్తొచ్చు. నా పేరు తీస్తే..దళిత సమాజం ఏమనుకుంటుందోనన్న భయం వారికి ఉంది. అందుకే ఆకాశరామన్న ఉత్తరాలు. వాళ్లు బయటకు వస్తే ..నేనూ బయటకు వస్తా. ఎగ్జామ్స్ నిర్వహణ కు సిస్టం ఉంటుంది. సిస్టంను అడిగితే అసలు విషయాలు తెలుస్తాయి. నన్ను గెలికి గెలికించుకోవద్దు. భావ స్వేచ్ఛ పేరుతో బరితెగిస్తే... మేమేంటో చూపిస్తాం. నా నాయకుడు స్వీటును అంగి కి పూస్తడు.. లుంగి కి పూస్తడు ..మీకేం తీట. సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టి నా జాతి ని అవమానిస్తున్నారు. మాదిగ జాతి అవసరం వచ్చినప్పుడు తిరుగుబాటు ఎలా ఉంటదో చూపిస్తుంది అంటూ తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు.



## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో రెండో మృతదేహం లభ్యం

**మరో ఆరింటి కోసం గాలింపు ముమ్మరం**

**హైదరాబాద్, మహా:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నుంచి మరో మృతదేహాన్ని సహాయక సిబ్బంది వెలికితీశారు. ఆ మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తవ్వకాలు జరుపుతుండగా లోకో ట్రాక్ వద్ద మృతదేహం ఆనవాళ్లను రెస్క్యూ టీమ్ గుర్తించారు. తవ్వకాలు జరుపుతుండగా దుర్వాసన వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. అనుమానిత ప్రాంతాలు డీ1, డీ2 కాకుండా మరో చోట తవ్వకాలను జరిపారు. మరోచోట తవ్వకాలు జరుపుతుండగా మృతదేహం ఆనవాళ్లను సిబ్బంది గుర్తించారు. ఫిబ్రవరి 22న జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారిలో ఇప్పటివరకు ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన ఆరుగురి కోసం సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కాగా మృతదేహం ఉత్తరప్రదేశ్ కు చెందిన ఇంజనీర్ గా గుర్తించారు. ప్రభుత్వం తరుపున ఆ కుటుంబానికి రూ.25లక్షల సాయం అందించారు.

## 13 గంటల పాటు కొనసాగిన అసెంబ్లీ

- **మారథాన్ సెషన్స్.. ఎంత సేపు చర్చకైనా రెడీ అంటున్న అధికారపక్షం**
- **రాత్రి 11 గంటల వరకు కొనసాగిన శాసన సభ సమావేశాలు**

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షం ఏ అంశంపైన అయినా, ఎంత సేపయినా చర్చకు రెడీ అంటోంది. సోమవారం ఏకంగా 15గంటల పాటు సభ సాగితే, మంగళవారం 13గంటల పాటు బిల్లులపై చర్చలు కొనసాగాయి. మంత్రులు ఓపికగా సమాధానాలు చెబుతూ, విపక్షాలను ఎదుర్కొంటుండగా.. గతంలో అవకాశాలు రాని ఎంతో మంది ఎమ్మెల్యేలకు ఈ సారి చర్చకు అవకాశం ఇస్తున్నారు. ఇపుడు ఎవరు మాట్లాడినా.. అంత తొందరగా మైకులు కట్ కావడం లేదు. ప్రజాసమస్యలు ఉంటే.. అవి ప్రభుత్వానికి వ్యతిరేకమైనా వింటూ మంత్రులు నోట్ చేసుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హుందాగా సభను నడుపుతుండగా, మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్, హయ్యర్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్, కమర్షియల్ టాక్సెస్ అడ్మినిస్ట్రేషన్, క్రీడలు యువజన సర్వీసుల శాఖల పద్దుల పై చర్చ జరిగింది. వీటితో పాటు రోడ్లు రవాణా శాఖ, పద్దు, ఎక్సైజ్ అడ్మినిస్ట్రేషన్, టూరిజం, ఆర్ట్ అండ్ కల్చరల్ శాఖల పద్దుల పై చర్చ జరిగింది. మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టిన అటవీ, శాస్త్ర, సాంకేతిక పర్యావరణ, దేవాదాయ శాఖ పద్దుల పై కూడా చర్చ జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు శాసనసభ వ్యవహారాల మంత్రిగా బిల్లులపై చర్చ వ్యూహాత్మకంగా ప్రశాంతంగా కొనసాగేలా సమన్వయం చేశారు.

# మంత్రి గారూ.. నమస్కారం

## వివేక్‌ను పలకరించిన మల్లారెడ్డి

**ఇపుడు వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హవా నడుస్తోందన్న మల్లారెడ్డి**
**కేసీఆర్, మల్లారెడ్డి కుటుంబాల హవా కూడా నడిచిందన్న వివేక్**





**మహా :** తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వివేక్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మధ్య ఆసక్తికరమైన సంభాషణ చోటు చేసుకుంది. రాష్ట్రంలో మీ కుటుంబాల హడావుడి నడుస్తోందంటే, కాదు మీదే నడుస్తోందని ఇరువురు పరస్పరం వ్యాఖ్యానించుకున్నారు. అసెంబ్లీ లాబీల్లో వీరిద్దరు ఎదురుపడ్డారు. అక్కడ మల్లారెడ్డి, వివేక్‌ను 'మంత్రి' అంటూ సంబోధించారు. అందుకు వివేక్ ధన్యవాదాలు తెలిపారు. వివేక్ మొత్తానికి సాధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కంటే ముందే ఢిల్లీకి వెళ్లి వచ్చారు" అని మల్లారెడ్డి అన్నారు. దానికి వివేక్ బదులిస్తూ తాను వేరే పని మీద వెళ్లి వచ్చానని చెప్పారు. అయినా తెలంగాణలో వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హవా మాత్రమే నడుస్తోందని మల్లారెడ్డి నవ్వుతూ వ్యాఖ్యానించారు. దానికి వివేక్ స్పందిస్తూ, కేసీఆర్, మల్లారెడ్డి కుటుంబాల హవా కూడా నడుస్తోంది కదా అని సమాధానం ఇచ్చారు. ఇప్పుడు తమ హవా నడవడం లేదని మల్లారెడ్డి బదులిచ్చారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలని భట్టికి విజ్ఞప్తి**

14 ఏళ్లుగా పెండింగులో ఉన్న ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులను ప్రారంభించాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఉపముఖ్యమంత్రి వెంటనే పనులు ప్రారంభించేందుకు రూ. 50లక్షల నిధులను మంజూరు చేశారు.

# 400 ఎకరాల భూమిపై తప్పుడు ప్రచారం

## ఐఎంజీ కేటాయింపులు రద్దయితే టీజీఐఐసికి కేటాయింపు

### రాతి నిర్మాణాలు అపురూపమైన రాయి గ్రీన్ జోన్ గా గుర్తింపు.. మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**మహా:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని 2003లో క్రీడా సౌకర్యాల అభివృద్ధి పేరిట ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీదర్‌బాబు తెలిపారు. ఆ సంస్థ ప్రాజెక్టును ప్రారంభించలేదని, 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించి కేటాయింపును రద్దు చేసిందని తెలిపారు. మంగళవారం కంచ గచ్చిబౌలిలోని సర్వే నెం. 25లో ఉన్న 400 ఎకరాల భూమి గురించి వచ్చిన ప్రచారం వక్రీకరించేలా ఉందని ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వివరిస్తూ ఐఎంజీ అకాడమీస్ ఈ కేటాయింపు రద్దుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా 07 మార్చి 2024 న హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది. దానిపై ఆ సంస్థ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలు చేసిందని, 03 మే 2024న సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసిందని తెలిపారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్‌లు రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఈ 400 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా ధృవీకరించారని, ఈ భూమికి అటవీ శాఖకు ఏ సంబంధం లేదని, ఇది పూర్తిగా ప్రభుత్వ భూమి అని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఈ 400 ఎకరాల భూమిని కొత్త భూ కేటాయింపు విధానం ప్రకారం టీజీఐఐసీకి కేటాయించడానికి రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ అప్పగించింది. టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల భూమిలో బఫెలో లేక్, పికాక్ లేక్‌లు లాంటి ప్రకృతి ప్రదేశాలు లేవని స్పష్టం చేసిందన్నారు. ఈ భూమిలోని రాతి నిర్మాణాలు, పుట్టగొడుగు ఆకారపు అపురూపమైన రాయిని గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ ప్రణాళికను కూడా సిద్ధం చేసి అమలు చేయనుందన్నారు. టీజీఐఐసీ హైదరాబాద్ విశ్వవిద్యాలయ భూమిని ఆక్రమించలేదని, అలాగే నీటి వనరులను రాతి నిర్మాణాలను తొలగించలేదన్నారు. ప్రభుత్వ భూమిలో, టీజీఐఐసీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. ఈ అభివృద్ధి, సుస్థిర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని అభివృద్ధి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కోసం టెండర్లను ఆహ్వానించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు.



# రూ.15వేల కోట్లు లక్ష్యంగా టూరిజం పాలసీ

## 3 లక్షల మందికి ఉపాధి.. సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్:** పర్యాటక శాఖ టూరిజం పాలసీ లక్ష్యాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. అసెంబ్లీలో పర్యాటక శాఖ పద్దుపై మాట్లాడిన జూపల్లి.. గత పదేళ్లలో బీఆర్ ఎస్ ప్రభుత్వం టూరిజం సెక్టర్ ను నిర్లక్ష్యం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధికి పాలసీని తీసుకొచ్చిందన్నారు. రాబోయే ఐదేళ్లలో పర్యాటక రంగంలో రూ. 15వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దీంతో మూడు లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ఆదాయంలో టూరిజం వాటా 10శాతం పెంచుతామన్నారు. తెలంగాణలోని జిల్లాల్లో వివిధ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చి దిద్దేందుకు స్పెషల్ టూరిజం ఏరియాస్ సెక్టార్లుగా గుర్తించామన్నారు. తమ నియోజకవర్గ పరిధిలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. బోటింగ్, హరిత హోటల్స్, వాటర్ స్పోర్ట్స్, రోప్ వే, వెల్నెస్ సెంటర్లు, ఎకో టూరిజమ్, థీమ్ పార్కులు, సస్పెన్షన్ బ్రిడ్జి, గ్లో గార్డెన్స్, మ్యూజికల్ ఫౌంటెన్స్ 3D ప్రొజెక్షన్ మ్యాపింగ్, సౌండ్ అండ్ లైట్ షో మొదలైన వాటి ఏర్పాటుకు అనుమతులు, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు.

పర్యాటక అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 243కోట్లు కేటాయిస్తే.. మా ప్రభుత్వంలో ఒక్క బడ్జెట్‌లోనే రూ.738 కోట్లు కేటాయించామన్నారు. టూరిజం హోటల్స్ ప్రస్తుతం టూరిజం ఆధ్వర్యంలో మొత్తం 43 హోటల్స్, 32 రెస్టారెంట్లు (వే సైడ్ ఎమినిటీస్) కలవు. వీటిలో 23 హోటల్స్, ఒక రెస్టారెంట్ టూరిజం కార్పొరేషన్ నిర్వహిస్తుండగా, 16 హోటల్స్, 17 రెస్టారెంట్లు ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్వహించేందుకు ఇంతవరకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. వీటి నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



### కేంద్ర ప్రభుత్వం సహకారంతో..

స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్మెంట్ పథకం ద్వారా నల్లమల్ల టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి రూ. 68 కోట్లు రామప్ప టూరిజం సర్క్యూట్ అభివృద్ధి నిమిత్తం రూ.73 కోట్లు ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్మెంట్ స్కీమ్ ద్వారా బుద్ధవనం డిజిటల్ ఎక్స్పీరియన్స్ సెంటర్ కు రూ.25 కోట్లు, నిజాంసాగర్ లో ఎకో టూరిజం అభివృద్ధికి రూ.10 కోట్లు బల్కంపేట దేవాలయం అభివృద్ధి నిమిత్తం రూ. 4.20 కోట్లు స్వదేశీ దర్శనం పథకం కింద భువనగిరి కోట అభివృద్ధికి రూ. 56 కోట్లు, అనంతగిరి ఎకో టూరిజం అభివృద్ధికి రూ.38 కోట్లు కేటాయింపు

### భవిష్యత్తు ప్రణాళికలు

- మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించటమే లక్ష్యంగా మూసీ పునరుజ్జీవనం
- పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు
- బాపు ఘాట్ వద్ద అభివృద్ధికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు
- లండన్ ఐ తరహాలో జాయింట్ అబ్సర్వేషన్ వీల్ ఏర్పాటు
- ఫ్యూచర్ సిటీ లో గోల్ఫ్ కోర్స్, జాతీయ , అంతర్జాతీయ సమావేశాల నిర్వహణకు 20 వేల మంది సామర్థ్యంతో ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ తరహాలో ఏర్పాటు
- రియో కార్నివాల్ లాంటి ఫెస్టివల్ తరహాలో హైదరాబాద్ కార్నివాల్ ఏర్పాటు

# ఈ సయమంలో అందాల పోటీలు అవసరమా?

## వేసవి సమయంలో నీటి ఎద్దడి నివారణపై చర్యలు చేపట్టండి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**మహా:** వేసవి సమయంలో నీటి ఎద్దడి నివారణపై చర్యలు చేపట్టకుండా అందాల పోటీలు నిర్వహిస్తారా? అని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్సయిజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లిని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేస్ ద్వారా రూ.700కోట్లా ఆదాయం వచ్చిందని, రూ.46 కోట్ల ఖర్చు చేస్తే రాద్ధాంతం చేసి రేస్ నిర్వహణ జరగకుండా చేశారని, ఇప్పుడు రూ.54 కోట్లతో మిస్ వరల్డ్ పోటీలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీల ద్వారా ఆదాయం ఎలా వస్తుందో, కొలువులు ఎలా వస్తాయో పర్యాటక శాఖ మంత్రి వివరించాలని అన్నారు. మిస్ యూనివర్స్, మిస్ యూనివర్స్ అవుట్ డేటెడ్ అయ్యాయిని అన్నారు. ఇదే మంత్రి, బీఆర్ఎస్ హయంలో పర్యాటక మంత్రిగా ఉన్నారని అన్నారు. అంబేద్కర్ విగ్రహనికి ఎప్రిల్ 14 నుంచి అయినా పర్యటకులు ఆహ్వానించాలని అన్నారు. అమరవీరుల జ్యోతిని పర్యాటక ప్రాంతంగా వినియోగించుకోవచ్చని అన్నారు. బీఆర్ఎస్ హయంలో రామప్పకు యూనిస్కో గుర్తింపు వచ్చిందని ఆ దిశగా కేంద్రానికి లేఖ రాసి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. పర్యాటక అభివృద్ధి చేపడుతున్నామన్న రంగనాయక సాగర్, పోచంపాడు, మల్లన్న సాగర్ కాళేశ్వరంలో భాగంగా నిర్మించినవేనని గుర్తు చేశారు. మేము ఓఆర్ఆర్ టీవోటీ పద్ధతిలో 33 సంవత్సారా లీజ్ కు ఇస్తే ప్రశ్నించిన వారు, ఇప్పుడు పర్యాటక శాఖకు చెందిన భూములను 99 సంవత్సారాల లీజుకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.





## జగ్గారెడ్డి జయలక్ష్మి ఫిలింస్


- ఇక జూబ్లిహిల్స్సే అడ్డా
- ఇక సిన్మాపైనే కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ ఫోకస్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ లీడర్ జగ్గారెడ్డి తాను తీయబోయే సినిమా కోసం ఈ నెల 30న కొత్త ఆఫీస్ ను ప్రారంభించనున్నారు. జయ లక్ష్మి ఫిల్మ్స్ పేరుతో కొత్త ఆఫీస్ ఏర్పాటు చేయనున్నారు. 30న ఉగాది రోజు ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ లో ఆఫీస్ ప్రారంభోత్సవం జరగనుండగా, సినిమా వర్క్ ను ఇక నుంచి జూబ్లీహిల్స్ ఆఫీస్ నుంచి జగ్గారెడ్డి పర్యవేక్షించనున్నారు. జగ్గారెడ్డి కొత్త సినిమా పై రాజకీయ ,సినీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. పోస్టర్ కు భారీ రెస్పాన్స్ రావడం తో సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# బెట్టింగ్ యాప్స్ కేసులో దూకుడు పెంచిన మియాపూర్ పోలీసులు

## పలు కంపెనీలపై కేసులు నమోదు

**మహా :** బెట్టింగ్ యాప్స్ కసులో మియాపూర్ పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు మరింత లోతుగా దర్యాప్తులోకి వెళ్ళి ఏ యాప్ కు ఎవరు ప్రమోటర్ గా వ్యవహరించారన్న అంశంపై ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా కొంత మందిని గుర్తించారు. జంగిల్ రమ్మీ యాప్ కోసం రానా, ప్రకాష్ రాజ్ ప్రమోట్ చేసినట్లు గుర్తించారు. ఏ 23 యాప్ కోసం విజయ్ దేవరకొండ, యోలో 247 యాప్ కోసం మంచు లక్ష్మి పని చేసినట్లు తేల్చారు. ఫెయిర్ ప్లే లైవ్ యాప్ కోసం ప్రచారం చేసిన హీరోయిన్ ప్రణీత. జీట్ విన్ యాప్ కోసం నిధి అగర్వాల్ ప్రచారం చేసినట్లు గుర్తింపు. ఆంధ్ర 365 ఆప్ కోసం నటి శ్యామల పనిచేసినట్లు గుర్తించారు. రీతు చౌదరి, టేస్టీ తేజ, బయ్య సన్నీ లు పలు యాప్ కోసం ప్రచారం చేసినట్టు గుర్తించారు వీరందరిపై మరిన్ని ఆధారాలను సేకరించిన తర్వాత విచారణకు రావాలని నోటీసులు జారీ చేయాలని పోలీసులు భావిస్తున్నారు. హర్ష సాయి, విష్ణు ప్రియలు పలు యాప్ ల కోసం కోసం ప్రచారం చేసినట్లు గుర్తించిన పోలీసులు. వి బుక్, తాజ్ 77, దని బుక్, మామ 247, తెలుగు 365, ఎస్ 365, జై 365, పారి మ్యాచ్ కోసం ప్రచారం. పలువురు యూట్యూబర్లు ప్రచారం చేసినట్లు గుర్తించిన పోలీసులు. ఇప్పటికే బెట్టింగ్ యాప్ కేసులపై దర్యాప్తును వేగవంతం చేసిన పంజాగుట్ట పోలీసులు పలువురు సెలబ్రిటీలను విచారిస్తున్న విషయం తెలిసిందే.



### ప్రభుత్వ విజయోత్సవాలు

# నెలరోజులు ధూంధాం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో నెలపాటు ప్రభుత్వ విజయోత్సవ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు, బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులను శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రభుత్వ దినోత్సవ సభలు జరపాలని డిసైడ్ అయ్యారు. బాబు జగ్జీవన్ రాం జయంతి అయిన ఏప్రిల్ 5 నుంచి నెలాఖరు వరకు పలు జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుండగా, ప్రభుత్వ మొదటి వార్షికోత్సవ సభలను నిర్వహించిన స్థాయిలోనే విజయోత్సవ సభలు జరపనున్నారు. ఎస్సీ , బీసీల కు ప్రభుత్వం చేసిన సామాజిక న్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోయేలా భారీ బహిరంగ సభ లు జరపనున్నారు. ఈ సభలకు సంబంధించి వేదికలు ఖరారుచేయనున్నారు.

### మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నూతనంగా ఏడుగురు

# స్పెషలిస్ట్ వైద్యుల నియామకం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మరో కొత్త శోభను తీసుకువచ్చే విధంగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్ల గారి చొరవతో 7 మంది నూతన స్పెషలిస్ట్ వైద్యులను ప్రభుత్వం నియమించడం మణుగూరు ప్రజలకు శుభపరిణామం. గతంలో ఉన్న 6 మంది వైద్యులతో పాటు ఇప్పుడు మొత్తం 13 మంది వైద్యులు అందుబాటులో ఉండటంతో వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి.



**మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నియమితులైన వైద్యుల వివరాలు:**

నూతనంగా నియమించబడిన స్పెషలిస్ట్ వైద్యులు 7*
గైనకాలజిస్ట్ (GYNAECOLOGIST) - 2
అనస్థీషియాలజిస్ట్ (ANAESTHESIOLOGIST) - 2
పిల్లల వైద్యుడు (PEADIATRICIAN) - 1
జనరల్ ఫిజీషియన్ (GENERAL PHYSICIAN) - 1
స్కానింగ్ వైద్యుడు (RADIOLOGIST) - 1
గతంలో ఉన్న వైద్యులు 6*
ఎం.బి.బి.ఎస్ వైద్యులు (MBBS) - 5
డెంటల్ వైద్యుడు (BDS) - 1

### జమిలి ఎన్నికలపై ఏర్పాటైన

# జేపీసీ గడువు పొడిగింపు

**మహా:** జమిలి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కాలపరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జేపీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, బీజేపీ ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన గడువు పెంపు తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. రాబోయే వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు గడువును పొడిగించింది. 39 మంది ఎంపీలతో ఏర్పాటు చేసిన జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేస్తోంది. ఇందులో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. వాస్తవానికి ఈ కమిటీ కాలపరిమితి ఏప్రిల్ 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలి ఉందని అధికార వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో జేపీసీ గడువు పొడిగించే తీర్మానానికి లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది.

# విజయ్ దేవరకొండను వదిలిపెట్టేదేలేదు

## బెట్టింగ్ యాప్స్ డ్రగ్స్ కంటే డేంజర్

### సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేసిన కేఏ పాల్

**హైదరాబాద్, మహా:** బెట్టింగ్ యాప్స్ పై యూట్యూబర్ అన్వేష్ స్టార్ట్ చేసిన పోరాటం జాతీయస్థాయిలో సంచలనం రేపుతోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో ఇప్పటికే పలువురు యూట్యూబర్లు, టాలీవుడ్ స్టార్లపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఇదిలా ఉండగా..ఇప్పుడు సీన్ లోకి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఎంటరయ్యారు. బెట్టింగ్ యాప్స్ పై సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు కేఏ పాల్. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. బెట్టింగ్ యాప్స్ డ్రగ్స్ కంటే ప్రమాదకరమైనవి అని... ప్రతి ఇంట్లో అరచేతిలో ఉండే ఫోన్లోనే లభిస్తాయని అన్నారు. తెలంగాణలో యాప్స్ పై బ్యాన్ ఉన్నప్పటికీ 978 మంది చనిపోయినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయని అన్నారు కేఏ పాల్.క్రీడాకారులు, సినీ నటులను యువత రోల్ మోడల్ గా తీసుకుంటారని.. కానీ వారంతా సైతాన్లుగా మారారని అన్నారు. పరోక్షంగా ఇంత మంది చావులకు కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్స్ ద్వారా రూ. 7 14వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వాలు మిన్నకున్నాయని ఆరోపించారు కేఏ పాల్. అంతకంటే ఎక్కువ నిధులు నేను తెచ్చి పెడతానని అన్నారు. అన్ని మనీ గేమింగ్ యాప్స్‌ను తక్షణమే బ్యాన్ చేయాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు . 72 గంటల్లోగా విజయ్ దేవరకొండ, రానా, నిధి అగర్వాల్ ఇతర సెలబ్రిటీలు ప్రకాష్ రాజ్ లా ముందుకొచ్చి క్షమాపణ చెప్పాలని... నష్టపోయినవారికి పరిహారం ఇప్పించాలని అన్నారు.సెలబ్రిటీలు ఎవరినీ వదిలి పెట్టనని... ఇది బెదిరింపు కాదు, ఈడ్చుకెళ్తానంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.





# క్యాన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు!

- కోరిక నెరవేర్చి క్రికెట్ కిట్ అందజేసిన మంత్రి
- అన్నగా అండగా ఉంటానని భరోసా

**హైదరాబాద్ , మహా:** "సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్" క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. వింటే మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా పాలిమల మండలం సర్వాయ్ పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ కాన్సర్ తో బాధపడుతూ... ఖాజాగూడలోని లోని స్పర్ష్ హస్పీస్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నితిన్ మాటలకు కన్నీళ్లు పెట్టుకున్న శ్రీధర్ బాబు.. అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంతన్నగా వెంట నిలుస్తానని, ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

### మహిళలకు ఇచ్చిన హామీల అమలు కోసం

# బీజేఎంఎం నిరసన

## మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి అరెస్టు చేసిన పోలీసులు

**మహా :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో మహిళా మోర్చా కార్యకర్తలు అసెంబ్లీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్న ఆరోపణతో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 ఆర్థిక సహాయం, 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు ఉచితంగా స్కూటీలు, వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 20 లక్షలకు పెంచుతామని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత వాటి ఊసెత్తడం లేదని మండిపడ్డారు. పెన్షన్ మొత్తాన్ని రూ.4,000కి పెంచుతామన్నారని, ఇప్పుడు పెన్షన్ పెంపు పరతిపాదనే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు మాట మీద నిలబడటం లేదెందుకు..? అభయ హస్తం నిధులు ఇంకెప్పుడు విడుదల చేస్తారని నిలదీశారు. హామీల అమలులో వైఫల్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాలోకానికి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని, అధికారంలోకి రాగానే వెనుకడుగు వేసిన కాంగ్రెస్ పార్టీ, పదే పదే మోసం చేస్తోందని దుయ్యబట్టారు. మహిళలపై వేధింపులు, హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళల సమస్యలు పట్టవని, వారు యోట్లు కావాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేలుకొని రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు. నిరసనకు దిగిన నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని తుకారాం గేట్, అప్జల్ గంజ్, ఫలక్ నుమా, నారాయణగూడ, సీతాఫల్ మండి పోలీస్ స్టేషన్లకు తరలించారు





# ప్రొహిబిషన్ ఎక్కడ ఉంది సార్

## అక్బరుద్దీన్ ప్రసంగంతో సభలో నవ్వులే నవ్వులు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఎంఐఎం నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో నవ్వులు పూయించారు. సభలో అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పేరు మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో ప్రొహిబిషన్ ఎక్కడుంది? అని ప్రశ్నించారు. మద్యం విషయంలో రాష్ట్రంలో అత్యధిక రెవెన్యూ వస్తుంది.. మందు తాగుతున్నరు.. తాగిస్తున్నరు.. చిన్నా పెద్దా ఎలక్షన్ సమయంలో మద్యం వినియోగం పెరుగుతుంది, కానీ ఇందులో ప్రొహిబిషన్ ఎక్కడ ఉంది సార్.. అంటూ ప్రశ్నించారు.

# హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు

## హర్షం వ్యక్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

### డిప్యూటీ సీఎం భట్టికి సన్మానం



**హైదరాబాద్, మహా:** శాతవాహన యూనివర్సిటీ కి హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజి, కరీంనగర్ లో లా కాలేజి మంజూరు చేస్తూ ఉత్తర్వులు రావడం పట్ల అసెంబ్లీ లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ని మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. తన నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కాలేజీ మంజూరుకావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం , శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్ లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# ప్రభుత్వ బడికి ప్రాధాన్యత ఏది!?

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తిరిగి మరోసారి ప్రభుత్వ బడులకు అభయహస్తం కు బదులు మొండి చెయ్యి చూపించింది. 3.05లక్షల కోట్ల తెలంగాణా బడ్జెట్లో విద్యారంగం కు కేవలం7.57 శాతం తో 23,108కోట్లు మాత్రమే కేటాయించారు.గత 202425 బడ్జెట్లో విద్య కోసం 21,801కోట్లు కేటాయించగా ఈసారి కేవలం 1307కోట్లు మాత్రమే అదనంగాకేటాయించారు. ఈ ఏడాది తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రాదాన్యత లైన 58 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లకు కేటాయించిన 2000కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కోచింగ్ కు కేటాయించిన 200కోట్లు మినహాయిస్తే కనుక గత ఏడాది కంటే 893 కోట్లు తక్కువ కేటాయింపు విద్యకు ఉంది. రాష్ట్రంలో ఉన్న 1,48,456 మంది ఉపాధ్యాయులు,మరో4 వేల మంది అధ్యాపకులు వేతనాలు నెలకు సరాసరి ఒక లక్ష రూపాయలు వేసుకున్నా ఏడాదికి వేతనాలు రూపంలో 18,240 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మిగిలిన 21వేల కోట్లలో18వేల కోట్లపైచిలుకు వేతనాలకు పోతే, మిగిలిన 3వేల కోట్ల లోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠశాలల ఇన్ఫ్రాస్ట్రక్చర్ అబివృద్ధి, విద్యాశాఖ బోధనేతర సిబ్బంది జీతాలు, రెసిడెన్షియల్ పాఠశాలలఖర్చులు, కాంటింజెన్సీ, పాఠ్యపుస్తకాలు ముద్రణ, ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ,మానెటరింగ్, విద్యాశాఖ వ్యవస్థాపక ఖర్చులు ,పరీక్షలు,ఫీజు రీయంబర్స్ మెంట్ , యూనివర్సిటీ గ్రాంట్లు అన్నీ లెక్కిస్తే విద్యాశాఖ కేటాయింపులు హళ్ళీకి హళ్ళీ,సున్నాకు సున్నా మాత్రమే!? ఇక విద్యా శాఖలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 19,734, మాధ్యమిక పాఠశాలలు 3,237,ఉన్నత పాఠశాలలు 4,843, రెసిడెన్షియల్ పాఠశాలలు 969, జూనియర్ కళాశాలలు 1000వరకు ఉన్నాయి.ఇవికాక ప్రభుత్వ గ్రాంట్లతో నడిచే 662 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి.202324విద్యాగణాంకాలననుసరించి ప్రభుత్వ పాఠశాల ల్లో28లక్షల పైచిలుకు విద్యార్థులు ఉన్నారు.ఈపాఠశాలల్లో కనీస సౌకర్యాలు సంగతి అటుంచి రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది.ఇప్పటికే కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టిన 400 పైచిలుకు రెసిడెన్షియల్ పాఠశాలల వలన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో2లక్షలమంది విద్యార్థులు తగ్గిపోయారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్తగా పెట్టే 58ఇంటిగ్రేటెడ్ పాఠశాలల మూలంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోమరో29వేలవిద్యార్థులసంఖ్యతగ్గే ప్రమాదంపొంచిఉంది.ప్రభుత్వాలే అనాలోచితంగా ప్రభుత్వ పాఠశాలల గొంతునులుముతున్నాయి,అన్న బావన కలిగించ గూడదు!.ప్రభుత్వపాఠశాలల్లో విలువైన భూములు,భవనసముదాయాలు,కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య లేక వేలాది రూపాయలు వేతనం పొందుతూ,గోళ్ళు గిల్లుకుంటూకూర్చుంటున్న ఉపాధ్యాయులుఉన్నారు,30,684 ప్రభుత్వ పాఠశాలలల్లో చాలా భాగం సంఖ్య తక్కువగా, కొంత భాగం నిరర్థకంగా మారి ఉండగా,వాటిని గాలికి వదిలి కేవలం 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల కొరకు 2వేల కోట్లు ఖర్చు చేసి ఒక్కోపాఠశాలకు 25ఎకరాల భూసేకరణ, కోట్లాది రూపాయలు తో కొత్త భవనాలు కట్టి కాంట్రాక్టర్లను బాగుచేయడం తప్ప మరో కొత్తదనం కనిపించడంలేదు?29 వేలు ఉనికి లోలేని పిల్లల కోసం 2వేల కోట్లు ఖర్చుకు వెనకాడని ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుతున్న 28లక్షల మంది పిల్లల కోసంవాళ్ళ భవిష్యత్తు కోసం ఎందుకు ఆలోచించదు?ఇంత జేసి ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు పిల్లలు ఎక్కడనుండి రావాలి.ప్రైవేటు పాఠశాల నుండి రారు కదా? తిరిగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉన్న ఆర్థిక స్థోమత లేని మరో 29వేల పిల్లలను కొత్త రెసిడెన్షియల్ పాఠశాలలకుతరలించాలసిందేకదా? ఉన్న ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం ద్వారా పేదలకు నాణ్యమైన విద్య అందించవచ్చు! కానీ ఉన్న వసతులు, భవనాలు వాడుకోకుండాప్రభుత్వ పాఠశాల లు గాలికొదిలేసి, బలహీన పరిచి ఎవరికోసం ఎందుకోసం ఈ కొత్త ఏర్పాట్లు? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకునూరి మురళి నేతృత్వంలో తెలంగాణా విద్యా కమీషన్ ఏర్పరిచింది.




> ప్రభుత్వ బడుల పై ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వంకు తెలంగాణా విద్యా కమిషన్ నివేదిక అందించింది. అందులో చాలా విలువైన సూచనలు,సిఫార్సులు ఉన్నాయి. ప్రతిమండలంలో నాలుగు "తెలంగాణా పౌండేషన్"పాఠశాలలు, మూడు "తెలంగాణా పబ్లిక్ పాఠశాలలు "ఏర్పాటు చేయాలని, ప్రీప్రైమరీ నుండి ఇంటర్ వరకు ఒకే ఆవరణ లో విద్య అందుబాటులోకి తేవాలని కమిషన్ సిపార్స్ చేసింది.

> బడ్జెట్లో 30 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలకు,తెలంగాణా విద్యా కమిషన్ సూచించిన సంస్కరణ లకు రూ. 30వేల కోట్లు కేటాయించి , తెలంగాణా విద్యా కమిషన్ సూచలను అమలు పరచాలి. ప్రభుత్వ బడుల రక్షణ కోసం పెద్ద ప్రజా ఉద్యమ అవసరమే ఉంది.

కమీషన్ రాష్ట్రం అంతా తిరిగి వివిధ వర్గాల నుండి అభిప్రాయం సేకరించి ఒక నివేదిక అందించింది, కొన్ని విలువైన సిఫార్సులు, సూచనలు చేసింది. ప్రభుత్వ విద్యారంగంలో మౌలిక మార్పుప్రజలు ఆశిస్తున్న విషయం స్పష్టం చేసింది. ప్రభుత్వ బడుల పై ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వంకు తెలంగాణా విద్యా కమీషన్ నివేదిక అందించింది. అందులో చాలా విలువైన సూచనలు,సిపార్శులు ఉన్నాయి. ప్రతిమండలంలో నాలుగు "తెలంగాణా పౌండేషన్"పాఠశాలలు, మూడు "తెలంగాణా పబ్లిక్ పాఠశాలలు "ఏర్పాటు చేయాలని, ప్రీప్రైమరీ నుండి ఇంటర్ వరకుఒకే ఆవరణ లో విద్య అందుబాటులోకి తేవాలని కమీషన్ సిపార్స్ చేసింది. అంతేకాదు అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలను మినీ గురుకులాలుగా మార్చాలని స్పష్టం చేసింది, ఎక్సెస్ లెస్ హ్యాబిటేషన్ల నుండి ఈ పాఠశాలలకు ఉచిత ట్రాన్స్ పోర్టు సౌకర్యం కూడా ప్రతిపాదించింది .ఈ సంస్కరణ అమలుకోసం కనీసంగా 30వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా కూడా ఇచ్చింది. బడ్జెట్ కంటే ముందే నివేదిక ప్రభుత్వానికి తెలంగాణా విద్యా కమీషన్ అందజేసింది. కానీ, తాము నియమించిన విద్యా కమీషన్ సిఫార్సులకు తెలంగాణా బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. తాము ముందు నిర్ణయించుకున్న, కేవలం 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు బడ్జెట్ లో2వేలు కోట్లు కేటాయించారు. తెలంగాణా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల సంస్కరణను గాలికి వదిలేయడంలో అంతర్యం ఏమిటి? ప్రభుత్వ పాఠశాలల్లో వృధా అవుతున్న మానవ వనరులు,బోధనా వనరులు,విలువైన భవనాలు వినియోగించుకోవాలనే ఆలోచన ఈ ఆధునిక ప్రభుత్వాలకు ఎప్పుడు జ్ఞానోదయం అవుతుంది? ప్రభుత్వాలకుప్రభుత్వ పాఠశాలల బాగోగులు పట్టావా? బడ్జెట్ లో నిధులను కేటాయించకుండా ప్రభుత్వ బడుల సంస్కరణ ఎలా సాద్యం అవుతుంది? ఇత్యాది ప్రశ్నలు కు జవాబు ఎక్కడ నుండి లభించాలి. ప్రభుత్వ పాఠశాల కోసం తాము నియమించిన కమీషన్ ఇచ్చిన సిఫార్సులు తామే తుంగలో తొక్కితే కమీషన్ కున్న విశ్వాసనీయత ఎంత? కమీషన్ సిఫార్సులు ఎప్పుడు అమలు జరగాలి.ప్రభుత్వబడులు ప్రజలకు ఎప్పుడు సంస్కరణలతో కొత్త రూపంతో, అవసరాలు తీర్చే విధంగా ఎప్పుడు మారాలి? మూతపడే వరకు ప్రభుత్వ బడుల ప్రస్థానం కొనసాగవలసిందేనా? ఎంతో చారిత్రాత్మకమైన,విలువైన, ఏళ్ళతరబడి అనుబంధం ఉన్న ప్రభుత్వ బడులుకళ్ళముందే కునారిల్లుతుంటే ,కూలిపోతుంటే ప్రజలుఎలాఅర్థం చేసుకోవాలి?ఇత్యాది ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వంనే జవాబు దారీ కావాలసి ఉంది.దీర్ఘకాలికంగా నైనా విద్యకు కెటాయించే నిదులు మానవవనరుల అబివృద్ధి, తద్వారా కుటుంబాల అబివృద్ధి జరుగుతుందనే ప్రాథమిక అవగాహన ప్రతి పౌరుడికి ఉండాల్సిన అవసరం ఉంది. బడ్జెట్లో30వేలపైచిలుకు ప్రభుత్వ పాఠశాలలకు,తెలంగాణా విద్యా కమీషన్ సూచించిన సంస్కరణ లకు30వేలకోట్లు కెటాయించి ,తెలంగాణా విద్యా కమీషన్ సూచనలు అమలు పరచాలని డిమాండ్ చేద్దాం. ప్రభుత్వ బడుల రక్షణ కోసంపెద్ద ప్రజా ఉద్యమ అవసరమే ఉంది..



ఎన్.తిర్మల్, సీనియర్ జర్నలిస్టు
సెల్:9441864514,

## భారతీయులకు అమెరికా షాక్

### స్టూడెంట్ వీసాల జారీలో భారీ కోత




అమెరికా విద్యార్థి వీసాల జారీలో అమెరికా భారీగా కోత విధిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41 శాతం దరఖాస్తులను తిరస్కరించింది. పదేళ్లతో పోలిస్తే ఎఫ్1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. 202324 సంవత్సరంలో మొత్తం 6.79 లక్షల మంది F1 వీసా కోసం దరఖాస్తు చేసుకోగా.. వీటిలో 2.79 లక్షలు (41%) తిరస్కరణకు గురయ్యాయి. అంతకు ముందు ఏడాది 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షలు (36%) తిరస్కరణకు గురయ్యాయి. కాగా, 2024 మొదటి తొమ్మిది నెలల్లో భారతీయులకు జారీ చేసిన విద్యార్థి వీసాల సంఖ్య 2023తో పోలిస్తే 38% తగ్గింది. అయితే, గత దశాబ్దంలో దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ, వీసా తిరస్కరణల శాతం పెరిగింది. పదేళ్ల కిందట అంటే 201415లో 8.56 లక్షల మంది ఎఫ్1 వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గుతూ, కోవిడ్ ఏడాదిలో (20192020)లో అత్యల్పంగా 1.62 లక్షలకు పడిపోయింది. కరోనా వైరస్ మహమ్మారి అదుపులోకి వచ్చిన అనంతరం దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరిగినప్పటికీ, 202324లో 3% తగ్గింది. 202223లో 6.99 లక్షల నుంచి 202324లో 6.79 లక్షలకు తగ్గింది. ఫలితంగా, గత ఆర్థిక సంవత్సరంలో వీసా తిరస్కరణల సంఖ్య (2.79 లక్షలు) కనీసం ఒక దశాబ్దంలోనే అత్యధికంగా నమోదైంది. 202324లో మొత్తం 4.01 లక్షల ఎఫ్1 వీసాలు జారీ చేయగా.. అంతకు ముందు ఏడాది 4.45 లక్షలుగా ఉంది. ఎఫ్1 వీసా అనేది అమెరికాలోని విద్యా సంస్థల్లో చదువుకునే విదేశీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన నాన్ఇమ్మిగ్రెంట్ కేటగిరీ. ఈ వీసా జారీ తగ్గింపునకు ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్ నిబంధనలే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2019 నుంచి వీసా డేటాను లెక్కించే విధానంలో మార్పులే కారణమని అమెరికా అధికారి ఒకరు పేర్కొన్నారు. 'మునుపటి విధానం వర్క్లోడ్ చర్యల లెక్కింపుపై ఆధారపడింది.. ఇది దరఖాస్తుకు లింక్ చేయలేదు.. కొత్త విధానం నిర్దిష్ట రిపోర్టింగ్ వ్యవధిలో వీసా దరఖాస్తు ప్రక్రియ తుది ఫలితాలను మరింత ఖచ్చితంగా ప్రతిబింబిస్తుంది' అని చెప్పారు. ఇక, 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు భారతీయులకు 64,008 విద్యార్థి వీసాలు లభించాయి. 2023లో ఇదే కాలంలో 1.03 లక్షలుగా ఉంది. అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఓపెన్ డోర్స్ 2024 నివేదిక ప్రకారం.. 202324లో భారతీయ విద్యార్థుల సంఖ్య చైనీయుల కంటే ఎక్కువగా ఉంది. భారతీయ విద్యార్థులు 3.31 లక్షల మంది ఉన్నట్టు తెలిపింది. అమెరికా విద్యా సంస్థలు ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే భారతీయులు అధికంగా వెళ్తుంటారు.

## పాక్ ఎప్పటికి మారునో?

దాయాది దేశం పాక్ భారత్ పై మరోసారి తన అక్కసు వెళ్ళగక్కింది. బలూచిస్థాన్ ఉగ్ర ప్రేరేపితానికి భారత్ ను దోషిగా చూపుతోంది. పాక్ ఇలా భారత్ పై నెపం వేయటం కొత్తకాదు. విశ్వం లో ఎక్కడ ఉగ్ర చర్యలు జరిగినా భారతే కారణమని , విశ్వంలో భారత్ ను ఏకాకిని చేయాలని చూస్తోంది. కాని ఏ దేశం పాక్ కు మద్దతు ఇవ్వలేదు. దాంతో కంగు తింది పాక్. అసలు ఉగ్ర వాదానికి కేంద్ర బిందువు పాకే అని అందరకి తెలుసు. బలూచిస్థాన్ చర్యలు భారత్ ఖండించక పోవటం తో పాక్,భారత్ ను దోషిగా చూపాలి అనుకుంది. నిజానికి ఆ ఉగ్ర చర్యలతో భారత్ కు పనే లేదు. ఖండిస్తే అనుమానం లేనట్లు లెక్కా. హవ్వ నవ్వి పోదురు గాక. పాక్ మతి భ్రమించి మాట్లాడుతోంది. ప్రపంచం లోనే భారత్ కు శాంతి కాముక దేశమని పేరు. ఒక్క పాక్ కు అది తెలిసినట్లు లేదు. ఒక దేశం అంతరంగిక విషయాలపై భారత్ ఎప్పుడు జోక్యం చేసుకోదు. అది భారత్ నైజం కాదు. శాంతిగా ఉన్న దక్షిణ ఆసియాలో పాక్ ఉగ్రవాదానికి పేరు గాంచటం శోచనీయం. మరియు భారత్ పై అబద్ధాలు చెప్పటం దానికే చెల్లింది. ప్రస్తుతం అనేక సమస్యలతో భారత్ ఉంది. ఒక దేశాన్ని అస్థిర పరచడం ఎప్పటికి చేయదు. చెతనైనా సహాయం చేస్తుంది కాని ఉగ్రవాద కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితులలోను మద్దతు తెలపదు. భారత్ విదేశాంగా మంత్రి జై శంకర్ కూడా ఉప ఖండంలో ఎప్పుడు శాంతి ఉండాలి అని కోరుకునే నేత. పాక్ మాదిరి నెపాలు ఎన్నటికీ చేయదు. ఉగ్ర వాద నికి పుట్టినిల్లు పాక్. అంతేందుకు కరుడు గట్టిన ఉగ్ర నేత ఓసామా బిన్ లాడెన్ పాక్ లోనే ఆశ్రయం పొందాడు. అతన్ని మట్టు పెట్టింది కూడా పాక్ లోనే. అతను మా



దేశంలో లేడు అని బుకాయించిన పాక్ కు అతని మరణం తో పచ్చి వెలక్కాయి నోట్లో పడట్లు అయింది. ప్రపంచమంతా పాక్ ను దుమ్మేతి పోసినా దానికి సిగ్గు రాలేదు. ఆ అంటే భారత్ పై ఒంటి కాలి పై లేస్తుంది. భారత్ గట్టిగా సమాధానం ఇస్తే మిన్నకుండి పోతుంది. భారత్, పాక్ పట్ల ఎప్పుడు సానుకూల వైఖరినే కనపరుస్తుంది. పాక్ మాత్రం భారత్ ను ఒక శత్రువుగా చూస్తూ ఉండటం విచారకరం. అందుకనే భారత్ భద్రతా మండలిలో చేరకుండా రాజకీయం చేస్తుంది. రెండు దేశాల మధ్య ఏ క్రీడ కొనసాగినా ఉద్రిక్తంగా ఉంటుంది. ఇక క్రికెట్ క్రీడలో అయితే యుద్ధ వాతావరణమే. శాంతి అని భారత్ చేయి చాపినా పాక్ వెనుకంజ వేయటం దురదృష్టం. బలూచిస్థాన్ సంఘటన్లో భారత్ పాత్ర ఉందని ఆ దేశం ఆరోపణలు చేయటం దేశాల మద్దతు కొరకే. ముఖ్యంగా అగ్ర రాజ్యం మద్దతు పొందాలి అనుకుంటుందేమో ఆ దేశాది నేత వాస్తవాలు తెలిసిన వ్యక్తి కనుక పాక్ ఆటలు సాగలేదు ఇక నైనా పాక్, భారత్ పై అ బండాలు వేయకుండా తన దేశం అభివృద్ధి కొరకు ప్రయత్నిస్తే మంచిది. అసలే ఆర్థికంగా లేమి స్థితి లో ఉన్న పాక్ నిజానిజాలు గ్రహిస్తే, భారత్ పై అనవసర మాటల దాడికి .పాల్పడకుండా ఉంటే అ దేశానికే ఒకింత మేలు.

- కనుమ ఎల్లారెడ్డి,
93915 23027.

## పాకిస్థాన్‌కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

పాకిస్థాన్ కపటబుద్ధిని భారత్ ఎపుడూ బయటపెడుతూనే ఉంది. పాక్ కూడా ఎపుడూ దాచుకోకుండా ఉండలేక ప్రపంచం చేత తరచూ చీవాట్లు తింటోంది. అంతర్జాతీయ వేదికపై భారత్‌ను నిందించాలని మరోసారి యత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు ఎదురైంది. జమ్మూకశ్మీర్‌పై అనవసర ప్రస్తావన తీసుకొచ్చిన దాయాదికి భారత్ గట్టిగా చురకలంటించింది. ఆ ప్రాంతం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేసింది. పాక్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన కశ్మీర్ భూభాగాలను ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాంతి పరిరక్షణ సంస్కరణలపై చర్చ సందర్భంగా మాట్లాడిన పాక్ ప్రతినిధి సయ్యద్ తారిఖ్ ఫతేమీ, జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ ఆరోపణలపై ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆ దేశం అనవసర అంశాలను లాగుతోందని మండిపడ్డారు. సంకుచిత, విభజన ఎజెండాతో ఈ వేదిక దృష్టిని మళ్లించే కుతంత్రాలు చేయడం మానుకుంటే మంచిదని సూచించారు. "భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌పై పాకిస్థాన్ ప్రతినిధి మరోసారి అనవసర వ్యాఖ్యలు చేశారు. ఇలా పదేపదే ఈ అంశాన్ని లేవనెత్తడం వల్ల వారు చేసే చట్టవిరుద్ధ వాదనలు నిజమైపోవు. ఇలాంటి ప్రయత్నాలతో వారు ప్రోత్సహిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరు. జమ్మూకశ్మీర్ ఇప్పటికీ, ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. జమ్మూకశ్మీర్‌లోని కొంత భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు పాకిస్థాన్ నిరంతరంగా యత్నిస్తోంది. దాన్ని పాకిస్థాన్ కచ్చితంగా ఖాళీ చేయాల్సిందే. సంకుచిత, విభజన ఎజెండాతో ఈ వేదిక దృష్టిని మళ్లించే కుతంత్రాలు చేయడం మానుకుంటే మంచిదని సూచిస్తున్నామని ఐరాసలో భారత ప్రతినిధి పేర్కొన్నారు. గతవారం ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలోనూ పాక్ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించింది. దీనికి భారత్ కూడా దీటుగా బదులిచ్చింది. పాక్ పదే పదే అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టింది. ఆ దేశానిది మతోన్మాద మనస్తత్వం అని ఇలాంటి వ్యాఖ్యలతో అబద్ధాలను నిజం చేయలేరని భారత్ పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరని చురకలంటించింది. పాకిస్థాన్ తన దేశ ప్రజల సౌఖ్యం వదిలి పగ, ప్రతీకారాలు పెంచుకుంటూ ప్రజలను పేదరికంలో ఉంచుతోంది. ఎదుగుతున్న దేశాలను చూసైనా పాక్ బుద్ధితెచ్చుకుని భారత్ పై ఏడ్వడం ఆపేయాలి. ప్రగతిలో, వికాసంలో పోటీపడాలి. మెరుగుపడాలి.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

## క్యాన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు!

**కోరిక మేరకు క్రికెట్ కిట్ అందజేత**



**కాటారం, మహా :** "సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్" క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. వింటే మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయ్ పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ కాన్సర్ తో బాధపడుతూ...ఖాజగూడలోని స్పర్శ్ హస్పీస్ లో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలిసిన మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసానిచ్చారు. ఆసుపత్రిలో మంత్రి శ్రీధర్ బాబు ఆరోగ్య సమస్య పై మాట్లాడుతుండగా నితిన్ మాటలకు కన్నీళ్లు పెట్టుకున్న శ్రీధర్ బాబు.. అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంతన్నగా వెంట నిలుస్తానని, ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

## ఏజెన్సీ గిరిజన రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డితో కలిసి మొక్కజొన్న పంట వైఫల్యంపై ములుగు కలెక్టరేట్ లో సమీక్ష





**ములుగు, మహా :** ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ లో ఆదివాసి గిరిజన వ్యవసాయ క్షేత్రాలలో మొక్కజొన్న విత్తన పంట వైఫల్యంపై తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణా విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి, గంగాధర్, నరసింహ రెడ్డి, వెంకన్న యాదవ్ లతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఊరుకునేది లేదన్నారు. మొక్కజొన్న విత్తన పంట వైఫల్యానికి కంపెనీ ప్రతినిధులు బాధ్యత వహించాలన్నారు. తమను నమ్మి పంటల సాగులో ముందుకు వెళ్తున్న రైతులను మోసం చేయడం సరికాదన్నారు. అదేవిధంగా పలు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరిష్కార సూచనలను అధికారులకు తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. రైతులు అధైర్య పడవద్దని, అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్ ఇప్పటివరకు మొక్కజొన్న విత్తన పంట వైఫల్యానికి సంబంధించిన సంఘటనపై జరిగిన పురోగతిని వివరించారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాలతో క్షేత్రస్థాయిలో మొక్కజొన్న ఆకులు, కంకుల షాంపిల్స్ సేకరించి హైదరాబాద్ లోని డీఎన్ఏ ఫింగర్ ప్రింట్ ట్యాబ్ కు పంపించామని తెలిపారు. మార్చి 12, 13తేదీల్లో సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీకి సంబంధించిన ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు నివేదిక సమర్పించారని తెలిపారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి మొక్కజొన్న ఉత్పాదకత ఎందుకు తగ్గిందనే కోణంలో విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఏఓ, ఆర్డీవోలతో ఒక ప్రత్యేక కమిటీ వేసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని, ఏఈవోల ద్వారా మొక్కజొన్న విత్తన పంట క్షేత్రాలను సందర్శించి 2168ఎకరాల విస్తీర్ణంలో 959 మంది రైతులు నష్టపోయారని నివేదించినట్లు వివరించారు. కంపెనీ ప్రతినిధులు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రాథమికంగా అంగీకరించారని, రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్గనైజర్స్ రైతులకు అనధికారికంగా అధిక వడ్డీలకు అప్పులు విచ్చిన విషయంలో మనీలెన్డింగ్ యాక్ట్ కింద చర్యలు ప్రతిపాదించినట్లు తెలిపారు. కాగా, రైతు ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కజొన్న విత్తన పంట వైఫల్య నష్టపరిహారము చెల్లించాలని, అధిక వడ్డీ రుణాలను నిరోధించాలని, రైతులను ఆర్గనైజర్స్ ఏవిధమైన ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కమిషన్ ను కోరారు. ఈ సమావేశం లో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సిహెచ్.మహేందర్ జీ, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, అడ్వైజర్లు దొంతి నరసింహ రెడ్డి, రామాంజనేయులు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్ సుచరిత, ఆర్డీఓ వెంకటేష్, మెంబర్ సెక్రటరీ సంధ్యారాణి, విత్తన ఉత్పత్తికి సంబంధించిన కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కూలీలతో మమేకమై పని చేసిన జిల్లా కలెక్టర్

- ఉపాధి హామీ పనుల పరిశీలన
- పలుగు, పార పట్టిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మహా :** ఆయన ఓ అలుపెరుగని జిల్లా పాలనాధికారి. ప్రజల కష్టసుఖాలలో నేనున్నానంటూ ప్రజలతో మమేకమవుతూ, ఎందరికో ఆదర్శంగా, కర్తవ్యానికి నిర్వచనంగా నిలుస్తూ పలుగు, పార చేత పట్టి కూలీలతో కలిసి పని చేశారు. మంగళవారం జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులో జరుగుతోన్న ఉపాధి హామీ పథకం కింద ఆర్సీబీ రోడ్డు పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కూలీలతో కలిసి స్వయంగా కూలీ పని చేసి అందరిని ఆశ్చర్యపరిచాడు. అలాగే కూలీల సమస్యలు, కల్పిస్తున్న సౌకర్యాల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కూలీల కుటుంబ వివరాలు, ఉపాధి హామీ కూలీ డబ్బులు, పని వేళలు, తదితర విషయాలను అడుగుతూ, వారితో హాయిగా ముచ్చటిస్తూ వారికి స్ఫూర్తిని కలిగించారు. ఈ సందర్భంగా ఎంత మంది ఇక్కడ కూలీపనులు చేస్తున్నారు? వారి పని వేళలు ఎప్పటివరకు? రోజుకు ఎంత మేర కొలతతో పనులు చేస్తున్నారు? వంటి వివరాల పై ఆరా తీశారు. ఈ మేరకు అధికారులు స్పందిస్తూ..143 మంది కూలీలుగా పనులు చేస్తున్నారన్నారని ఎండాకాలం దృష్ట్యా వారి పని వేళలు ఉదయం 7 నుంచి 11 వరకు అని అన్నారు. రోజుకు రెండు మీటర్ ల వెడల్పు, ఒక మీటరు లోతు కొలతలతో పనులు చేస్తున్నారని వారు కలెక్టర్ కు వివరించారు. అలాగే ఉపాధి హామీ పనులకు సంబంధించిన కొలతల పుస్తకాన్ని, జాబ్ కార్డులను, మాస్టర్ రోల్ ను పర్యవేక్షించి అన్ని రిజిస్టర్ లను స్పష్టంగా నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా నిర్వహించాలని సూచిస్తూ, పనుల పురోగతికి సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి ప్రభావం ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శరీరం నిర్జలీకరణ (డీ హైడ్రేషన్) కు గురికాకుండా సరిపడా స్వచ్ఛమైన తాగునీరు, ఉత్తేజితులయ్యేందుకు గాను ఓఆర్ఎస్ నీటిని క్రమం తప్పకుండా తాగాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కూలీలకు సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీఆర్డీఏ వసంత, ఎంపిడిఓ శ్రీనివాస్, ఏపీఎంలు, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం కోశాధికారి గా

**ఆలేటి వెంకట లక్ష్మి ఎన్నిక**



**హుజూర్ నగర్, మహా :** హుజుర్ నగర్ పట్టణ మహిళా సంఘము ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం లో సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘము కోశాధికారి గా ఆలేటి వెంకట లక్ష్మి ఏకగ్రీవం గా ఎన్నికైన్నారు ఉపాధ్యక్షురాళ్లు గా పి. ఝన్సీ, పి. జ్యోతి, పి. రమాదేవి, సహాయ కార్యదర్శులు గా వి. శ్యామల, ఎన్. మణి, ఎం .పుష్ప, అర్. అనురాధ లు ఎన్నికైన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘము అధ్యక్షురాలు గరినే ఉమా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి విజయలక్ష్మి పాండు, వంకాయల పద్మావతి, పొత్తుముత్తు సోమ లక్ష్మి, ఓరుగంటి నరసింహ రావు, గరినే శ్రీధర్, మాశెట్టి అనంతరాములు, బచ్చు రామారావు, పెండేల నాగరాజు, కరాల పాపారావు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు,ఓరుగంటి పాండు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణయించిన సమయం లో ఇసుక లారీల రవాణా

**భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



**కాటారం, మహా :** జిల్లాలోని క్వారీల నుండి వివిధ పట్టణాలకు ఇసుక రవాణా చేసే లారీలు ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే ప్రయాణించాలని జిల్లా పోలీస్ సూపరిండెంట్ కిరణ్ ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్య రాకుండా ఇసుక లారీ డ్రైవర్లు పక్కాగా సమయ పాలన నిబంధనలు పాటించాలని, నిర్ణయించిన సమయంలోనే ఇసుక లారీలు రోడెక్కాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఇసుక లారీలకు జాతీయ రహదారిపై అనుమతి లేదని, హోల్డింగ్ పాయింట్స్ లో చెక్పోస్టుల్లో ఇసుక లారీలు నిలిపిఉంచి, సమయపాలన ప్రకారం నడుచుకోవాలని పేర్కొన్నారు. ఇసుక లారీల ట్రాఫిక్ నియంత్రణకు రేగొండ, కాటారం లలో రెండు చెక్పోస్ట్, హోల్డింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసినట్లు ,రేగొండలో ఎంటి ( ఖాళీ ) లారీలు, కాటారంలో ఇసుక లోడ్ లారీలు పార్కింగ్ చేసుకోవాలి. పోలీసుల తెలిపిన సమయపాలన ప్రకారం లారీ డ్రైవర్ లు నడుచుకోవాలని, ఉదయం, సాయంత్రం సమయపాలన పాటించాలని అన్నారు. రోడ్డుపై వాహనాలు ఆపి ఉండడం మూలంగా ప్రమాదాలు జరుగుతుండడంతో పాటు, ట్రాఫిక్ జామ్ అవుతుందని, రోడ్డుపై ఇసుక లారీలు పార్కింగ్ చేయకుండా 24 గంటలు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశామని ఎస్పీ పేర్కొన్నారు. లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణ, ఓవర్ స్పీడ్, పార్కింగ్ విధానం తదితర అంశాల అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జిల్లాలో కట్టుదిట్టంగా ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్నామని, ఇసుక లారీ డ్రైవర్లు సైతం పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.




## అంబలితో ప్రజలకు వేసవిలో మేలు

**మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహా రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా, మహా :** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహ రెడ్డి అన్నారు. వేసవి కాలం దృష్ట్యా మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ఆధ్వర్యంలో నూరు రోజులపాటు కొనసాగుతుందన్నారు. రాగి అంబలి కేంద్రాన్ని సందర్శించి, వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రంలో ప్రతిరోజు ఉచితంగా అందిస్తున్న రాగి అంబలి వితరణను అభినందనీయమని అన్నారు. వేసవికాలంలో మండల కేంద్రంలోని ప్రజలు, ప్రయాణికులు, వృద్ధులు ఇబ్బందులు పడొద్దని మంచి ఆలోచనతో రాగి అంబలిని ఉచితంగా అందజేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్, మాజీ సర్పంచ్ శంకర్,బీచ్యా నాయక్, శ్రీశైలం గౌడ్, జహంగీర్ అలీ,నరేష్, గురిగళ్ల రామ చంద్రయ్య, పిప్పల్ల వెంకటేష్, సత్యం, జల్కం రమేష్,సాయి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు సి డిఓఎస్ విధులే కీలకమం

**కోర్టు హెడ్ కానిస్టేబుల్ ను సన్మానించిన డిసిపి, ఏసిపి**



**వరంగల్, మహా :** నేరస్తులను పట్టుకోవడంలో పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమో శిక్షలు శాతం పెరిగేందుకు కోర్టు సి డిఓఎస్ విధులు అంతే కీలకమని మట్టెవాడ కోర్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ నిరూపించాడు. విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తూ శ్రీనివాస్ నోటిస్ లో ఉన్న ప్రతి కేసులో సాక్షులను విచారణలో భాగంగా విధిగా కోర్టులో హాజరు పరుస్తూ పలువురికి శిక్షలు పడేలా చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో నే సంచలనం రేపిన పోచమ్మ మైదాన్ సెంటర్లో జరిగిన సాయిబాబా మందిర్ పూజారి సత్యనారాయణ హత్య కేసులో కోర్టు దోషికి యావజ్జీవ జైలు శిక్ష విధించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసులో కూడా శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభతో విధులు నిర్వహించారు. అంతేకాకుండా ఫోక్సో కేసులో సైతం అత్యుత్తమ విధులు నిర్వహించి దోషికీ శిక్ష పడేలా విధులు నిర్వహించారు. ఆయన నోటీస్ కి తప్పు జరిగిందని వస్తే చాలు సాక్షాలను సాక్షులను ఎవరు తప్పుదోవ పట్టించకుండా చట్టంలో అందరూ సమానమేనని చట్ట పరిధిలో చట్టం నుంచి ఎవరు తప్పించుకోలేరని విధులు నిర్వహిస్తూ ఉన్నత అధికారులతో ప్రశంసలు పొందుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డిసిపి సెంట్రల్ జోన్ షేక్ సలీమా, వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, మట్వాడ సిఐ తుమ్మ గోపి,ఎస్సైలు, తోటి కానిస్టేబులు, హెడ్ కానిస్టేబులు పలువురు శ్రీనివాసును అభినందించి ఘనంగా సత్కరించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఇలాంటి పోలీస్ ఒక్కరు ఉంటే సామాన్యులకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## భరోసా షీ టీం కేంద్రాలను సందర్శించిన క్రైమ్స్ డిసిపి



**వరంగల్, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డిసిపి గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన బి జనార్ధన్ మంగళవారం రంగంపేటలోని భరోసా తో పాటు షీ టీం కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ లు సువర్ణ, సుజాతలు పుష్పగుచ్ఛాలు అందజేసి డీసీపీకి స్వాగతం పలికారు. అనంతరం లైంగిక దాడులకు గురైన మహిళలు బాలికలు యువతలకు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను ఇన్స్పెక్టర్ సువర్ణ డిసిపికి వివరించారు. అలాగే షీ టీం పనితీరు తో పాటు మహిళల భద్రత కోసం తీసుకున్న చర్యలు అలాగే చర్యలపై ప్రజలకు అవగాహన కోసం చేపడుతున్న కార్యక్రమాల పై ఇన్స్పెక్టర్ సుజాత డిసిపికి వివరించారు.

### కరీంనగర్ జిల్లాకు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలని

## హుస్నాబాద్ కు తరలించడం సరికాదు




**కరీంనగర్, మహా:** కరీంనగర్ జిల్లాకు మంజూరు అయిన ఇంజనీరింగ్ కళాశాలను పొన్నం ప్రభాకర్ తన శాసనసభ నియోజకవర్గంలోని హుస్నాబాద్ కి తరలించడం పట్ల సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు విచారం వ్యక్తం చేశారు కరీంనగర్ నగరంలో ఉన్న శాతవాహన యూనివర్సిటీకి అనుబంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మిస్తే కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేదని తను జన్మనిచ్చిన ప్రాంతంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ రావడం పొన్నం కి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ చుట్టుపక్కల ఉన్న అన్ని జిల్లాల్లో ఇంజనీరింగ్ కళాశాలు ఉన్నాయని కరీంనగర్ నగర కేంద్రంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే విద్య హబ్ గా కరీంనగర్ మారుతుందని పొన్నం ప్రభాకర్ తన వ్యక్తిగత స్వార్థం కోసం కరీంనగర్ కాకుండా సిద్దిపేట జిల్లాహుస్నాబాద్ లో నెలకొల్పడం విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్ నుండి హుస్నాబాద్ వెళ్లే దారిలో నిర్మించిన ప్రజలు సంతోషించే వారని కానీ తన ఇష్టారాజ్యంగా ఎక్కడో మారుమూల ప్రాంతంలో నిర్మిస్తామనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. వెంటనే ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల కరీంనగర్ జిల్లాలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సురేందర్ రెడ్డి,పైడిపల్లి రాజు,న్యాలపట్ల రాజులు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

### స్వచ్ఛ కరీంనగర్ గా మార్చేందుకు నగర

## ప్రజలు కృషి చేయాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**కరీంనగర్, మహా :** స్వచ్ఛ కరీంనగర్ గా మార్చేందుకు నగర ప్రజలు కృషి చేయాలని నగరపాలక సంస్థ కరీంనగర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు నగరంలో పర్యటించారు. వావిలాలపల్లి తో పాటు పలు కాలనీలలో పారిశుధ్య విభాగం అధికారులు సిబ్బంది తో కలిసి నగర పరిశుభ్రత, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్త ద్వారా వర్మికంపోస్టిగ్ (సేంద్రీయ ఎరువుల) తయారీ, పొడి చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టముక్కలను డీఆర్ సీసీ, ఆర్ ఆర్ ఆర్ సెంటర్లకు తరలించడం, స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రజాభిప్రాయ సేకరణ తదితర అంశాలపై పై స్థానిక మహిళలకు వివరిస్తూ... అవగాహన పపరిచారు. ఇండ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను ఇంట్లోనే వేరు చేయడం, డబ్బాలలో వేరు చేసిన చెత్తను నగరపాలక సంస్థ కార్మికులకు అందించడం లాంటి విషయాల పైన అవగాహన చేశారు. పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొవాలని మహిళలకు సూచించారు. ఈ సంధర్బంగా కమీషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ....స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో కరీంనగర్ నగరపాలక సంస్థ కు మెరుగైన ర్యాకు సాధించేలా మహిళలు కృషి చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రతి మహిళ బాగస్వాములై పరిసరాలను శుభ్రంగా మార్చుతూ... మీ ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను ఆకుపచ్చ, నీలంరంగు డబ్బాలలో తడి పొడి ని వేరు చేయాలన్నారు. ఇంట్లోనే సెగ్రిగేషన్ చేసిన తర్వాతే నగరపాలక సంస్థ కార్మికులకు డబ్బాలలో వేరు వేరు గా అందించాలని సూచించారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయకుండ కలిపి ఇస్తే ఎన్నో నష్టాలు జరుగుతున్నాయని తెలిపారు. చెత్తను సెగ్రిగేషన్ చేయకుండా అందిస్తే అలాంటి చెత్తను నగరపాలక సంస్థ కార్మికులు సేకరించరని తెలిపారు. వేరు చేసి ఇస్తేనే పారిశుధ్య కార్మాకులు సేకరిస్తారని తెలిపారు. సెగ్రిగేషన్ చేయకుండా అందిచరాదని సూచించారు. మీ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునేలా మహిళలు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ సర్వేక్షన్ ప్రజాభిప్రాయ సేకరణలో మహిళలు పాల్గొని పరిశుభ్రత గురించి అవగాహన చేస్కోని తెలుపాలని కోరారు.

## న్యాయవాది హత్య.. నిందితుడికి మరణ శిక్ష వేయాలి



- పాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా విచారణ జరపాలి
- ఉరి శిక్ష వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- ఆమనగల్ బార్ అసోసియేషన్

**రంగారెడ్డి జిల్లా, మహా :** హైదరాబాద్ లో ప్రముఖ న్యాయవాది ఇజ్రాయేల్ ని కత్తితో అతి కిరాతకంగా హతమార్చిన నిందితునికి పాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా విచారణ చేపట్టి, వెంటనే ఉరి శిక్ష వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమనగల్ లో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం కోర్ట్ ప్రాంగణం నుండి బస్టాండ్ వరకు ప్లకార్డ్స్ పట్టుకొని న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శేఖర్, రామకృష్ణ, మధు, మల్లేష్, జగన్ గౌడ్, గణేష్, కృష్ణ, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ భూమికి విముక్తి లాభించిందా ?

- గురునానక్, జేబీ ఇన్ఫ్రాలలో ప్రభుత్వ భూమి
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ
- సివిల్ రైట్ ప్రొటక్షన్ ఆర్గనైజేషన్ లో ఫిర్యాదు
- రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డుల ఏర్పాటు






**రంగారెడ్డి జిల్లా, మహా :** ఇబ్రహీంపట్నం మండలం ఖానాపూర్ గ్రామ పరిధిలో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే గైరాన్ భూమిని రెవెన్యూ అధికారులు కబ్జా చెర నుంచి విముక్తి చేశారు. ఇది ప్రభుత్వ భూమి' అంటూ సూచిక బోర్డులు పాతారు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండల, పరిధిలోని ఖానాపూర్ లో 33 ఎకరాల గైరాన్ భూమిని అదే గ్రామానికి చెందిన 60 మందికి రైతులకు 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం సర్టిఫికెట్లు అందించింది.. గ్యాప్ ఏరియా కింద ఉన్న భూములను గమనించిన కొందరు భూ అక్రమార్కులు, రైతులను మోసం చేసి, పక్క సర్వే నెంబరు అయినా 67 నెంబర్తో, బై నెంబర్ లింకు చేసి, పట్టా భూమిగా చిత్రీకరించి రియల్ వ్యాపారులకు అమ్మడంతో, కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు ఏకంగా హెచ్ఎండీఏ, పంచాయతీ వెంచర్లు చేశారు. దీనిలో రాష్ట్రంలో దిగ్గజ విద్యా సంస్థ అయిన గురునానక్ యూనివర్సిటీ, జేబీ సెరెనా ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్ట్రక్చర్స్ వంటి బడ రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా ఉండడం గమనార్హం. దీనిపై సివిల్ రైట్ ప్రొటక్షన్ ఆర్గనైజేషన్ ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు.

**ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత ఆదేశాల మేరకు...**

మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ పుష్పలత, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి సర్వే చేశారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని జీబీ రియల్ ఎస్టేట్ సంస్థలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించారు. గురునానక్ యూనివర్సిటీలో కొంతవరకు ఆక్రమించారని తేల్చారు. కొంతమంది రియల్ వ్యాపారులు 67 సర్వే నెంబర్ను నెంబరుకు గైరాన్ భూమిని లింకు చేస్తూ, బై నెంబర్లతో పట్టా నంబర్ గా రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు పోలీసు ప్రొటెక్షన్ తో సోమవారం గురునానక్ యూనివర్సిటీలో, జెబీ ఇన్ఫ్రా వెంచర్లో, పక్కనే ఉన్న హెచ్ఎండీఏ వెంచర్ లో, ఇది ప్రభుత్వ భూమి అని సూచిక బోర్డులు పాతించారు. పూర్తి స్థాయిలో భూములను స్వాధీనం చేసుకొని కబ్జాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఈ భూమి విలువ కోట్లలో ఉంటుందని తెలిపారు..

**ఇబ్రహీంపట్నం తాసిల్దార్ వివరణ...**

ఖానాపూర్ రెవెన్యూ పరిధి, ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 80లో నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చేపట్టిన వాటిపై చర్యలు ఉంటాయని, ఇక ముందు ఇట్టి ప్రభుత్వ భూములలో ఎవరు కూడా కబ్జాలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే మున్సిపల్ కార్యాలయం నుంచి ఇట్టి భూమిలో నిర్మాణ అనుమతుల కొరకై ఎవరైనా దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి అనుమతులు ఇవ్వకూడదని మున్సిపల్ కమిషనర్ కు, ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇక మీదట ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 80లో వెలిసిన వెంచర్లలో రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్కు ఆదేశాలు త్వరలో జారీ చేయడం జరుగుతుందని ఆమె వెల్లడించారు.

**స్థానికులు..**

సర్కారు ప్రభుత్వ భూములపై చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయమని అన్నారు కానీ ఈ చర్యలు నామమాత్రమే నా ? ఇక ముందు కూడా ఇలాగే కొనసాగుతుందా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా పున పరిశీలన చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

# గిరిజన సంస్కృతికి మ్యూజియం భద్రత

- ప్రపంచ వేదిక భద్రాచలం మ్యూజియం
- గిరి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పనే లక్ష్యం
- భద్రాచలం పర్యాటకానికి కొత్త రూపం ట్రైబల్ మ్యూజియం
- రామనవమి వేడుకల్లో మ్యూజియం ప్రారంభం
- భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను విడుదల



**హైదరాబాద్ మహా :** భద్రాచలం అనగానే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం మాత్రమే గుర్తుకు వస్తుంది. కానీ ఇప్పుడు ఈ పవిత్ర క్షేత్రం గిరిజన సంస్కృతికి మన్నింపు ఇస్తూ, వారి సంప్రదాయాలను, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేసే విధంగా మారుతోంది. తెలంగాణ ప్రభుత్వం భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం స్థాపన ద్వారా గిరిజన సంపదను కాపాడే మరో అద్భుతమైన అడుగు వేసింది. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మంగళవారం శాసనసభ ఆవరణలో భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, "గిరిజన సంప్రదాయాలను, వారి కళలను, వారి హస్తకళా నైపుణ్యాలను భద్రపరిచేందుకు, వాటికి సరైన మార్కెట్ లభించేందుకు మ్యూజియం ఉపయోగపడుతుంది" అని అన్నారు. భద్రాచలం ప్రాంతంలోని గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులను ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మ్యూజియం వేదిక అవుతుందని, వారి ఉపాధికి ఇది దోహదపడుతుందని ఆయన తెలియజేశారు.

**భద్రాచలం మ్యూజియం ప్రత్యేకతలు**

భద్రాచలంలో ఏర్పాటవుతున్న ట్రైబల్ మ్యూజియం గిరిజనుల ఆచార వ్యవహారాలను, వారి జీవన విధానాన్ని, వేషభాషలను ప్రదర్శించేలా రూపొందించనున్నారు. ఇందులో ముఖ్యంగా గిరిజన కళాకారుల చేతిపనులను ప్రదర్శించడంతో పాటు, ఆ కళలను విస్తృతంగా ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రత్యేక ప్రదర్శన గదులు ఏర్పాటు చేయనున్నారు. ఈ మ్యూజియంలో చేనేత, గిరి ఉత్పత్తులు, తాటిపత్తి పనులు, చెక్క పనులు, మట్టి బొమ్మలు, గిరిజన ఆభరణాలు, చేతితో నేసిన వస్త్రాలు ప్రదర్శనలో ఉంటాయి. ఇది గిరిజన సంపదను రక్షించడమే కాకుండా, వారి చేతిపనులకు మార్కెట్‌ను అందించే వేదికగా మారనుంది.

**గిరిజన ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు**

తెలంగాణలో గిరిజనులు చాలా ఏళ్లుగా సాంప్రదాయ కళలు, హస్తకళలు, ఆయుర్వేద ఔషధాలు, మట్టిపాత్రలు, ప్రత్యేకమైన ఆభరణాలు తయారు చేస్తూ వచ్చారు. అయితే, వాటికి సరైన మార్కెట్ దొరకకపోవడంతో, చాలా మంది ఆ వృత్తిని వదిలిపెట్టి వలసపోతున్నారు. ఈ నేపథ్యంలో, ట్రైబల్ మ్యూజియం ద్వారా వీరి కళలకు ప్రాచుర్యం పెంచడం, వారి ఉత్పత్తులను విక్రయించేందుకు వీలు కల్పించడం ముఖ్యలక్ష్యం. "గిరిజన సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకే భద్రాచలంలో ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నాం" అని మంత్రి పొంగులేటి చెప్పారు. మ్యూజియం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయి.

**రామనవమి వేడుకల్లో మ్యూజియం ప్రారంభం**

భద్రాచలంలో ప్రతి సంవత్సరం శ్రీ సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది భక్తులు ఈ పవిత్ర కార్యక్రమాన్ని వీక్షించేందుకు వస్తారు. ఈ ఏడాది రామనవమి వేడుకల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ట్రైబల్ మ్యూజియాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రారంభోత్సవానికి దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన కళాకారులు, ప్రముఖులు హాజరై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని మంత్రి తెలిపారు. భద్రాచలం ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు ఈ మ్యూజియం మరింత ప్రాచుర్యం కల్పించనుంది.

**భద్రాచలం - పర్యాటక కేంద్రంగా మారనున్నది**

ఇప్పటికే భద్రాచలం ఆధ్యాత్మిక కేంద్రంగా పేరు గాంచింది. ఈ మ్యూజియం ఏర్పాటుతో పర్యాటక రంగానికి కొత్త దారులు తెరుచుకుంటాయి. భద్రాచలం సందర్శించేందుకు వచ్చే భక్తులు ట్రైబల్ మ్యూజియం కూడా వీక్షించేందుకు ఆసక్తి చూపుతారు. ఈ మ్యూజియం కేవలం ప్రదర్శన హాలుగా కాకుండా, సందర్శకులకు గిరిజన సంపద గురించి అవగాహన కల్పించే కేంద్రంగా మారనుంది. గిరిజన కళాకారులకు ఇది పెద్ద అవకాశంగా మారుతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# హత్య కేసులో ఇద్దరి నిందితుల అరెస్ట్





**మహేశ్వరం, మహా :** కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సరస్వతి గూడ గ్రామంలో వివాహిత వ్యవహారంలో జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసిన కందుకూరు పోలీసులు. సిఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం సరస్వతి కూడా గ్రామానికి చెందిన మొలగాసి సుధాకర్ డ్రైవర్ గా పనిచేస్తూ ఉండేవాడు. ఓ వివాహితతో గత కొంత కాలంగా సర్ సంబంధాలు కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం సదరు మహిళ సోదరులకు తెలియడంతో, వాళ్లు సుధాకర్ ను పలుమార్లు హెచ్చరించారు. మృతుడు గతంలో మహిళలకు డబ్బు అప్పుగా ఇవ్వడం జరిగిందని, ఈ డబ్బు విషయమై ఆమె ఇంటి వద్ద గొడవ జరగడంతో, సమంత ఆమె అన్నదమ్ములతో కలిసి కందుకూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, నా వద్ద డబ్బులు తీసుకొని, నా పైన కేసు పెడతావా అని తాను కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని, సుధాకర్ అతని తల్లితో కలిసి బయలుదేరుతుండగా మార్గ మధ్యలో, సమంత అన్నదమ్ములు అయిన మాధరమోని, శేఖర్, వినయ్ ఇద్దరు కలిసి ఈనెల 22న మధ్యాహ్నం సమయంలో మృతుడి బైకు కూ, బైకుతో టక్కరు చేసి అతికిరాతనంగా బండరాయితో మోది, అతని తల్లినీ కొట్టి, చనిపోయాడని నిర్ధారించుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయారు. కొన ఊపిరితో ఉన్న సుధాకర్ ను నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 23న మరణించాడు. మృతుడి తమ్ముడు కందుకూరు పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, హంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టి, మంగళవారం అరెస్టు చేసి ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకొని, మహేశ్వరం కోర్టులో హాజరు పరిచి, తదుపరి రిమాండ్ కు తరలించారని పోలీసులు వెల్లడించారు.



## అక్రమంగా తరలిస్తున్న 26 పశువులు పట్టివేత

- ఐదుగురిపై కేసు నమోదు
- రెండు వాహనాలు స్వాధీనం

**ములుగు, మహా :** అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకొని 26 ఆవులు, ఎడ్లను గోశాలకు తరలించినట్లు సీహెచ్.వెంకటేవ్వర్ రావు తెలిపారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పక్కా సమాచారంతో ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా టీఎస్ 25 టీ 0759, టీఎస్ 25 టీ 9402 నెంబర్లుగల గూడ్స్ వాహనాల్లో 19ఆవులు, 7 ఎద్దులను బంధించి ఉన్నాయన్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని పశువైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం అక్రమంగా పశువులు తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని, పశువులను గోశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు. పశువులను అక్రమంగా రవాణా చేపడితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు.

# నేర సమీక్ష సమావేశం నిర్వహించిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్

**కరీంనగర్, మహా :** నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భాగంగా హుజురాబాద్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంనందు మంగళవారంనాడు కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం ను సరైన పద్దతిలో అవలంభించాలన్నారు. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు వారి వారి పరిధిలోని పోలీసు స్టేషన్లను తరుచూ సందర్శిస్తూ వారి పని తీరును పర్యవేక్షించాలన్నారు. డివిజన్ ల వారీగా ఏసీపీ అధికారులు డివిజన్ స్థాయిలో ప్రతినెల నేర సమీక్షలు నిర్వహించాలన్నారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత కల్పించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆకస్మాత్తుగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను పరిష్కరించేందుకు సరైన లాఠీ , హెల్మెట్ మొదలగు వాటిని ఎల్లపుడు కలిగి వుండి సంసిద్ధంగా వుండలన్నారు. ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహిస్తున్న ఎస్సై మరియు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీసు స్టేషన్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలీసుస్టేషన్ మరియు పరిసరాలు కనీస శుభ్రతను పాటించేలా చూడాలన్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పట్టుబడి పోలీసు స్టేషన్లలో వదిలివేయబడిన వాహనాలను వేలం వేయుటకు పై అధికారులకు తెలపాలన్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, పాయింట్ బుక్ ల ఏర్పాటు, సమన్లు మొదలుగు విధులను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. డివిజన్ మొత్తాన్ని సెక్టార్లుగా విభజించాలని ప్రతి సెక్టార్ కి గాను ఏఎస్సై లేదా హెడ్ కానిస్టేబుల్ లను ఇంచార్జ్ అధికారులుగా నియమించాలని, తిరిగి సెక్టార్లను, ఒకే మార్గంలో వుండే రెండు మూడు గ్రామాలని కలిపి సబ్ సెక్టర్లుగా విభజించి వాటికి పోలీసు కానిస్టేబుళ్లను కేటాయించాలని సూచించారు. దీని ద్వారా క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రజలకు సేవలందించగలమన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు.



గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా మరియు పి.డి.ఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడే వారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయిని నిర్మూలించేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా స్థానిక పాఠశాల, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చాలి.. రైతులకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**కరీంనగర్, మహా :** యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతనే హార్వెస్ట్ చేసేలా రైతులకు, హార్వెస్టింగ్ మిషన్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, తార్పాలీన్ కవర్లు వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఉన్న ప్యాడి క్లీనర్ లతో పాటు మరో 15 ప్యాడి క్లీనర్ లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెన్ వెంటనే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. రైతుకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలు వేరువేరు ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు. ఎండాకాలం దృశ్య రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్ట్



**ములుగు, మహా :** రెండు వేరువేరు దొంగతనాల్లో ముగ్గురిని సీసీ కెమెరాల సహాయంతో ఆచూకీ తెలుసుకొని అరెస్టు చేసినట్లు ఎస్హెచ్వో సీహెచ్. వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈమేరకు మంగళవారం ములుగు పోలీస్ స్టేషన్ లో నిందితులను అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. ములుగు సమీపంలోని గట్టమ్మతల్లి ఆలయంలో ఈనెల 15న అర్ధరాత్రి దొంగతనం జరిగిందని, రూ.52వేల విలువగల రెండు వెండి దీపాంతలు, ఇతర ఇత్తడి వస్తువులు చోరీ జరిగినట్లు ఆలయ ప్రధాన పూజారి కొత్త సదయ్య ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో సూర్యాపేట జిల్లాకు చెందిన ముంజాల విష్ణు, కోడి నాగమణిలు మేడారం తల్లులను దర్శించుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఆలయం వద్ద ఆగి వస్తువులను దొంగిలించినట్లు తేలింది. దీంతో ఈనెల 24న వారిని అదుపులోకి తీసుకొని దొంగిలించిన వస్తువులను రికవరీ చేశారు. అదేవిధంగా మల్లంపల్లిలోని మహంకాళి వైన్స్ ఈనెల 21న రాత్రి షాపు తాళాలు పగులగొట్టి రూ.24వేల నగదు చోరీ జరిగినట్లు యజమాని ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన చింతకింది సతీష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు కేసుల్లో సీసీ కెమెరాల ద్వారానే విచారణ చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు వివరించారు. వారిని రిమాండ్ కు తరలించామన్నారు.

# ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక

ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**జనగామ, మహా :** ఇఫ్తార్ సామరస్యానికి ప్రతికగా నిలుస్తుందని స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మంగళవారం స్టేషన్ ఘన్ పూర్ లోని ఈ ఆర్ ఎల్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో కలిసి శాసనసభ్యులు కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ... ముస్లింలకు రంజాన్ పండగ పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో నెల రోజులు ఉపవాస దీక్షలు చేపడతరన్నారని రంజాన్ పండగ ముస్లిం సోదరుల జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ ఇఫ్తార్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ...**

ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతూ రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు ముస్లిం సోదరులు కలెక్టర్ తో పాటు శాసనసభ్యులు కడియం శ్రీహరిను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ ఇఫ్తార్ కార్యక్రమంలో ఆర్డిఓ డి.ఎస్.వెంకన్న, తాసిల్దార్ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇఫ్తార్ నిర్వాహకులు యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## కూతురి ప్రేమ వివాహం పై ఆగ్రహించిన తల్లిదండ్రులు

- పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు
- కావ్య శ్రీ తల్లిదండ్రులపై కేసు నమోదు

**రంగారెడ్డి జిల్లా, మహా :** తన కూతురు ప్రేమ వివాహం చేసుకుందని ఆగ్రహించిన కావ్యశ్రీ తల్లిదండ్రులు, ఆమె అత్తవారింటిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాయపోలు గ్రామంలో అచ్చన్న మహేష్ అదే గ్రామానికి చెందిన చేగూరి కావ్యశ్రీ, రెండు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అట్టి ప్రేమ వివాహం ఇష్టం లేని కావ్యశ్రీ తల్లిదండ్రులు మరియు బందువులు మంగళవారం ఉదయం, కావ్యశ్రీ భర్త మహేశ్ వాళ్ళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, మహేశ్ అక్క మౌనిక పై దాడి చేయగా, గాయాల పాలైన ఆమె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ మేరకు కావ్యశ్రీ తల్లిదండ్రులతో పాటు, బంధువులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరాలు వెల్లడించారు.

# సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి





- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్

**వరంగల్, మహా :** సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ నగరం లోని పాత ఆజంజాహి మిల్స్ గ్రౌండ్స్ లో 16.7 ఎకరాల విస్తీర్ణంలో 80 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జి ప్లస్ టు కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి స్థాయిలో పనుల పురోగతిని బ్లూ ప్రింట్ మాప్ ప్రకారం పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకోగా, భవన స్ట్రక్చర్, బ్రిక్స్ వర్క్, సివిల్ వర్క్స్ ఫ్లోరింగ్ దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయని, ఫినిషింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. పురోగతిని రోజువారీగా అందించాలని సూచించారు. పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా చేపట్టి 2025 సెప్టెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ లక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, జిల్లా రోడ్ల భవనాల అధికారి రమేష్, డిఈ శ్రీధర్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విశ్వ ప్రసాద్, ఏఈ శ్రీకాంత్, తసిల్దార్ ఇక్బాల్, ఏజెన్సీ ప్రతినిధి, తదితరులు, పాల్గొన్నారు.

## మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

పంతంగి ప్రశాంత్



**రంగారెడ్డి జిల్లా, మహా :** మంచాల మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పంతంగి ప్రశాంత్ మంగళవారం పత్రిక సమావేశంలో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్రంలో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన విషయం మనందరికి తెలిసిందే. నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నా, పార్టీని నమ్ముకొని ఉన్న కార్యకర్తలకు భరోసాను ఇస్తూ పార్టీని ముందుకు నడిపిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఆయనకి తప్పకుండా మంత్రి పదవి ఇవ్వాలి. అలాగే హైదరాబాద్ ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న , ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దాదాపు 40 సంవత్సరాల తరువాత ఈ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా రంగారెడ్డి గెలుపొందడం జరిగింది.

# వరంగల్ కమిషనరేట్ పరిధిలో సీపీ సుడిగాలి పర్యటన





**వరంగల్, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ దామెర పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు పోలీస్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, పోలీస్ కమిషనర్ పరిశీలించడం, స్టేషన్ నందు విధులు సిబ్బంది వివరాలతో పాటు, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా ఎలాంటి నేరాలకు సంబంధించి కేసులు నమోదవుతాయని, ఎలాంటి గోడవలు అధికంగా జరుగుతాయి, ఎంత మంది రౌడీ షీటర్లు వున్నారు, వారిని ఎలా వారిని తనీఖీ చేసారు, అలాగే స్టేషన్ అధికారి రోజువారి వివరాలను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నెలకోసారి తప్పనిసరిగా స్టేషన్ అధికారి తప్పని సరిగా రౌడీ షీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై చుట్టు ప్రక్కల వారిని ద్వారా అరా తీయాలని, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యారుదలపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారికి సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్, ఏఎస్పీ ప్రస్తుతం దామెర స్టేషన్ ఎస్.హెచ్.ఓ ఏ.ఎస్పీ మనన్‌భట్, పరకాల ఏసిపి సతీష్‌బాబు వున్నారు.

**కటాక్ష పూర్ లో పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించిన సిపి**

అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసేందుకు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కటాక్ష పూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ డిసిపి అంకిత్‌కుమార్ తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో విధులు సిబ్బంది వివారాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, రోజు మొత్తం మీద ఎన్ని వాహనాలు తనీఖీ చేస్తారు. అలాగే అనుమతులు వున్న ఇసుక వాహనాలను ఏవిధంగా తనీఖీలు నిర్వహిస్తారని చెక్‌పోస్ట్ సిబ్బంది పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెక్‌పోస్టు సిబ్బంది తనీఖీ తీరును సిపి ఎదుట ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

**పోలీసు నిజాయితీగా పనిచేయాలి**

పోలీసుల గౌరవ మర్యాదలు పెంపొందించే విధంగా నిజాయితీగా పోలీస్ అధికారులు పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం తొలిసారి అత్మకూర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ రోజు ఉదయం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు సిసి కెమెరాల కంట్రోల్ రూంలోని సిసి కెమెరాల పనితీరు, స్టేషన్‌లోని వివిధ రికార్డు గదులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను తనీఖీ చేయడంతో పాటు, స్టేషన్ పనీతీరుతో పాటు ,స్టేషన్ పరిధిలో ఏలాంటి నేరాలు జరుగుతాయి. ఎంత మంది రౌడీ షీటర్లు వున్నారు? రోజు ప్రమాదాల సంఖ్య, పోలీస్ స్టేషన్ పరిధి, స్టేషన్ సిబ్బంది మొదలైన వివరాలను ఇన్స్‌స్పెక్టర్ సంతోష్‌ను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా నిజాయితీ పనిచేయాలని, ఫిర్యాదులుపై వేగంగా స్పందించాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ భూపాలపట్నం ప్రధాన రోడ్డు మార్గం వుండటం ద్వారా ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తూ చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా వుండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఏసిపి సతీష్‌బాబు పాల్గొన్నారు.

# కోడింగ్‌లో కృత్రిమ మేధ ఏం చేస్తుందంటే..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకుస్తోంది. కోడింగ్ ప్రక్రియలో సృజనాత్మకతను, సామర్థ్యాన్ని సమకూరుస్తోంది. కోడింగ్‌లో ఏఐ నిర్వహిస్తున్న కొన్ని అంశాలను సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**కోడ్ జనరేషన్:** గిట్‌హబ్ లాంటి కోపిలాట్ కృత్రిమ మేధ ఆధారిత సాధనాలు నేచురల్ ల్యాంగ్వేజీ వివరణల ఆధారంగా కోడ్ స్నిప్పెట్లు, ఫంక్షన్లు, మాడ్యూల్స్‌ను తయారు చేస్తుంది. ఇది మాన్యువల్ కోడింగ్‌ను తగ్గించి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌ను వేగవంతం చేస్తుంది.

**బగ్ డిటెక్షన్:** ఏఐ అల్గారిథమ్స్ నమూనాలను విశ్లేషించడం ద్వారా కోడ్‌లో బగ్స్, సమస్యలను గుర్తిస్తున్నారు. ఈ టూల్స్ రియల్ టైమ్ ఫీడ్ బ్యాక్‌ను అందిస్తాయి.

**కోడ్ ఆప్టిమైజేషన్:** ఏఐ ఇప్పటికే ఉన్న కోడ్‌ను విశ్లేషించగలదు. పనితీరు, రీడబిలిటీ, నిర్వహణను మెరుగుపరచడానికి ఆప్టిమైజేషన్‌లను సూచిస్తుంది. ఇది వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి, మెరుగైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడానికి సాయం చేస్తుంది.


**టెస్టింగ్:** టెస్ట్ కేసులను జనరేట్ చేయడం, ఎడ్జ్ కేసులను గుర్తించడం, పునరావృత టెస్టింగ్ పనులను ఆటోమేట్ చేయడం ద్వారా ఏఐ టెస్టింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది.

**కోడ్ రివ్యూ అసిస్టెన్స్:** ఏఐ ఆధారిత కోడ్ రివ్యూ టూల్స్ పీర్ రివ్యూల సమయంలో కోడ్‌ను మెరుగుపరచడానికి, కోడింగ్ ప్రమాణాలు, ఉత్తమ పద్ధతులకు కట్టుబడి ఉండేలా చూడటానికి సూచనలను అందిస్తాయి.

**డీబగ్గింగ్ సపోర్ట్:** కోడింగ్‌లో సమస్యలకు మూలకారణాన్ని గుర్తించడం, సంభావ్య పరిష్కారాలను సూచించడం ద్వారా డీబగ్గింగ్ చేయడంలో ఏఐ టూల్స్ డెవలపర్లకు సహాయపడతాయి. ట్రబుల్ షూటింగ్ కోసం వెచ్చించే సమయాన్ని తగ్గిస్తాయి.

**లెర్నింగ్ అండ్ అప్ స్కిల్లింగ్:** ఇంటరాక్టివ్ ట్యుటోరియల్స్‌ను సిఫార్సు చేయడం ద్వారా డెవలపర్లు కొత్త ప్రోగ్రామింగ్ ల్యాంగ్వేజీలు, ఫ్రేమ్ వర్క్‌లను నేర్చుకోవడానికి ఏఐ తోడ్పడుతుంది.

**అనాలిసిస్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చారిత్రాత్మక డేటాను విశ్లేషించడం ద్వారా ప్రాజెక్ట్ టైమ్ లైన్లు, వనరుల అవసరాలు, సంభావ్య ప్రమాదాలను అంచనా వేయగలదు.




# ట్రంప్ ఎఫెక్ట్.. కేంద్రం గూగుల్ ట్యాక్స్ రద్దు?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ నిర్ణయాల వల్ల చాలా దేశాలు తమ విధానాలను సమీక్షించుకోవాల్సి వస్తుంది. భారతదేశం కూడా దీనికి మినహాయింపేమీ కాదు. టారిఫ్ బెదిరింపులు చాలా దేశాలు అమలు చేస్తున్న విధానాల్లో మార్పులకు దారితీస్తున్నాయి. అందులో భాగంగా భారత్ తాజాగా 6 శాతం 'గూగుల్ ట్యాక్స్'ను రద్దు చేయాలని యోచిస్తున్నట్లు నేషనల్ మీడియాలో వార్తాకథనాలు ప్రచురితమయ్యాయి.

గూగుల్, మెటా.. వంటి విదేశీ టెక్ కంపెనీలు అందించే ఆన్‌లైన్ అడ్వర్టైజింగ్ సేవలపై 'గూగుల్ ట్యాక్స్' అని పిలువబడే 6 శాతం ఈక్వలైజేషన్ లెవీని భారతదేశం తొలగించే అవకాశం ఉంది. ఫైనాన్స్ బిల్లులో సవరణల నేపథ్యంలో 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ పన్నును రద్దు చేయనున్నట్లు వార్తా సంస్థ రాయిటర్స్ తెలిపింది. 2016లో ప్రవేశపెట్టిన ఈ లెవీ భారత మార్కెట్‌కు గణనీయమైన ఆదాయాన్ని ఆర్జించే సాధనంగా ఉండేది. విదేశీ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల ఉనికి భారత్‌లో భౌతికంగా లేకపోయినా కేంద్ర ఖజానాకు తమ వాటాను అందించేలా ప్రత్యేకంగా ఈ లెవీని రూపొందించినట్లు సిరిల్ అమర్చంద్ మంగళ్దాస్ పార్టనర్ తుషార్ కుమార్ తెలిపారు. ఆదాయపు పన్నుకు లోబడి ఉన్న దేశీయ సంస్థలు, సంప్రదాయ అంతర్జాతీయ పన్ను నిబంధనలకు లోబడి ఉన్న విదేశీ సాంకేతిక సంస్థల కార్యకలాపాలను సమతుల్యం చేయడమే ఈ లెవీ ప్రాథమిక లక్ష్యమని వివరించారు.

**గూగుల్ ట్యాక్స్‌ను కేంద్రం ఎందుకు తొలగిస్తుంది?**

ఈ లెవీ తొలగింపు భారతదేశం డిజిటల్ పన్నుల చట్రంలో మార్పును సూచిస్తుంది. గూగుల్, మెటా వంటి అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాలపై పన్ను వివక్షాపూరితంగా ఉందని నిరంతరం అభ్యంతరం వ్యక్తం చేసిన యూఎస్‌తో వాణిజ్య ఘర్షణలను తగ్గించడానికి ఇది వ్యూహాత్మక చర్యగా పరిగణిస్తుందని కుమార్ అన్నారు. గతంలో ఈ లెవీ విదేశీ డిజిటల్ కంపెనీలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపిందనే వాదనలున్నాయి. భారతీయ వ్యాపారాలకు అందించే ఆన్‌లైన్ అడ్వర్టైజింగ్ సేవల ద్వారా వచ్చే ఆదాయంపై 6 శాతం పన్నును ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. పర్యవసానంగా, ఈ ఖర్చుల భారం ప్రకటనదారులపైనే పడేది. తద్వారా భారతీయ సంస్థలకు డిజిటల్ మార్కెటింగ్ ఖర్చులు పెరిగాయని కుమార్ అన్నారు.

**టెక్ దిగ్గజాలకు ప్రయోజనం చేకూరుతుందా?**

ఈక్వలైజేషన్ లెవీ రద్దుతో విదేశీ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లపై పన్ను భారం తగ్గుతుంది. తద్వారా మరింత అనుకూలమైన పెట్టుబడి వాతావరణాన్ని పెంపొందించవచ్చు. గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ అడ్వర్టైజింగ్ సేవలను పొందే భారతీయ వ్యాపారాలపై మార్కెటింగ్ ఖర్చుల భారం తగ్గే అవకాశం ఉంటుంది. ఇది మరింత డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలను ప్రేరేపిస్తుంది.

# విద్యుత్ వాడుతూ.. మిగిలింది అమ్ముతూ..

**హైదరాబాద్:** ఎలక్ట్రిక్ టూవీలర్స్ తయారీ సంస్థ ప్యూర్(Pure) సరికొత్త రంగంలోకి అడుగుపెట్టింది. ఇళ్లతోపాటు, వాణిజ్య, గ్రిడ్‌స్థాయిలో ఉపయోగపడే ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్ (విద్యుత్తును నిల్వ చేసుకుని అవసరానికి తగ్గట్టుగా వాడుకునేందుకు వీలు కల్పించే) ఉత్పత్తులను 'ప్యూర్‌పవర్(PurePower)' పేరుతో మార్కెట్‌లోకి తెచ్చింది. ఇవి సాధారణ యూపీఎస్‌లలో మాదిరిగా వీటిల్లో లెడ్ ఆక్సైడ్ బ్యాటరీలు కాకుండా.. అత్యాధునిక లిథియంఅయాన్ బ్యాటరీలు ఉండటం ఒక ప్రత్యేకతైతే.. సౌర విద్యుత్తు లాంటి సంప్రదాయేతర ఇంధన వనరులతో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును కూడా ఎటువంటి అదనపు పరికరాల అవసరం లేకుండా నిల్వ చేసుకోగలగడం ఇంకో ప్రత్యేకత. కొంచెం సులువుగా చెప్పుకోవాలంటే.. మీ ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని 'ప్యూర్ పవర్: హోం'ను వాడటం మొదలుపెట్టారనుకోండి.. మీ ఇంటికి కావాల్సిన విద్యుత్తును అక్కడికక్కడ ఉత్పత్తి చేసుకుని వాడుకోవడమే కాకుండా.. మిగిలిపోయిన విద్యుత్తును నేరుగా ప్రభుత్వానికి అమ్ముకోవచ్చునన్నమాట. నీతీఆయోగ్ సభ్యుడు, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కె.సారస్వత్ మంగళవారం




హైదరాబాద్‌లోని నోవోటెల్‌లో ప్యూర్‌పవర్ ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్యూర్ సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నిశాంత్ దొంగరి మాట్లాడుతూ "దేశం మొత్తమ్మీద రానున్న 18 నెలల్లో 300 మంది డీలర్ల ద్వారా 'ప్యూర్ పవర్' ఉత్పత్తులను మార్కెట్ చేయనున్నాము'' అని తెలిపారు. యూపీఎస్‌లతో పోలిస్తే ప్యూర్‌పవర్ ఎన్నో విధాలుగా ప్రత్యేకమైనవని, నానో పీసీఎం మెటీరియల్ ద్వారా భద్రతకు పెద్దపీట వేశామని ఆయన తెలిపారు. ప్యూర్‌పవర్‌లో ప్రస్తుతం రెండు రకాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామని, గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసే 'ప్యూర్‌పవర్: గ్రిడ్'ను వచ్చే ఏడాది లాంచ్ చేస్తామన్నారు. ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో వాడుకోగలిగిన 'ప్యూర్‌పవర్:హోం' 3 కిలోవోల్ట్ ఆంపియర్ (కేవీఏ), 5కేవీఏ, 15కేవీఏ సామర్థ్యాల్లో లభిస్తాయని ధర రూ.74,999తో ప్రారంభమవుతాయని చెప్పారు. దుకాణాలు, కార్యాలయాలు, టెలికాం టవర్స్ వంటి వాటి కోసం 25 కేవీఏ నుంచి 100 కేవీఏల సామర్థ్యం గల 'ప్యూర్‌పవర్' కమర్షియల్‌ను అందుబాటులోకి తెస్తున్నామని నిశాంత్ వివరించారు. వీటి వాడకం ద్వారా డీజిల్ జనరేటర్ల అవసరాన్ని లేకుండా చేసుకోవచ్చునని తెలిపారు. ప్యూర్‌పవర్ మూడో ఉత్పత్తి గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసుకునేదని, 20 అడుగుల పొడవైన కంటెయినర్‌లోకి ఇమిడిపోయే 'ప్యూర్‌పవర్: గ్రిడ్'లో ఏకంగా నాలుగు మెగావాట్ల విద్యుత్తును నిల్వ చేసుకోవచ్చునని ఆయన వివరించారు. సోలార్ పార్కుల్లో వీటిని ఏర్పాటు చేసుకుంటే.. విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో ఉత్పత్తి చేసిన విద్యుత్తును ఎక్కువ ఉన్న సమయంలో సరఫరా చేసేందుకు వీలేర్పడుతుందన్నారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ ఉత్పత్తులను బుక్ చేసకోవచ్చునని, నెలాఖరు నుంచి డెలివరీ మొదలవుతుందని తెలిపారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ప్రజాప్రతినిధులు లేని పాలన ఇంకెన్నాళ్లు?

## మూడేళ్ల క్రితమే ముగిసిన బీఎంసీ కార్పొరేటర్ల పదవీకాలం

పలుమార్లు ఎన్నికల వాయిదా.. కమిషనర్ల ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు

ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రతిపక్షాల మండిపాటు

ఇంకెన్ని రోజులు ఎన్నికలు వాయిదా వేస్తారంటూ ఆగ్రహం

**ముంబై:** దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని కలిగిన ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)కు గత మూడేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో మూడేళ్లుగా ప్రజాప్రతినిధులు లేకుండానే మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిపాలన కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**రాజకీయ పరిణామాల రీత్యా...వాయిదా**

2022, మార్చి 7న మున్సిపల్ కార్పొరేటర్ల పదవీకాలం ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల కారణంగా వాయిదాపడుతూ వచ్చాయి. గత మూడేళ్లలో, ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన బాధ్యతలను మొదట ఇక్బాల్ సింగ్ చాహల్ ఆ తరువాత భూషణ్ గగ్రానీ స్వీకరించారు. ఈ మూడేళ్లలో వీరిద్దరూ మున్సిపల్ కమిషనర్లు స్వయంగా మూడు బడ్జెట్లను సమర్పించారు. ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా నగరానికి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టారు. మున్సిపల్ ఎన్నికలు జరగకపోయినా మూడేళ్ల వ్యవధిలో రూ.6,000 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నలిచ్చారు. ముఖ్యంగా రోడ్లు, మురుగునీటి శుద్ధి, డీశాలినేషన్ ప్రాజెక్టులు, దహిసర్-భయందర్ లింక్ రోడ్డులకు అనుమతులు మంజూరుచేశారు.

**ప్రభుత్వ అప్పుల పెరుగుదల....**

2024-25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ కార్పొరేషన్ అప్పులు రూ.1.90 లక్షల కోట్లుగా తేలింది. తాజా లెక్కల ప్రకారం, ఈ సంఖ్య రూ.2,32 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో, బడ్జెట్ వ్యయంపై బహిరంగ చర్చ జరగలేదు.

**కమిషనర్లు పరిపాలించడమేమిటి?**


కమిషనర్ల ఆధ్వర్యంలో బీఎంసీ పరిపాలన జరగడమేమిటంటూ విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు లేని పాలన ప్రజాస్వామిక విధానాలకు విరుద్ధమని, ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా కీలక



నిర్ణయాలు అమల వుతున్నాయని ఆరోపిస్తున్నాయి. మున్సిపల్ పాలనలో పారదర్శకత లేదని, పెద్ద మొత్తంలో నిధులు ఖర్చవుతున్నాయని మండిపడుతున్నాయి.

**మరో 6–7 నెలల తర్వాతే!**

ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఎన్నికలు మరో 67 నెలలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. 1984లో అప్పటి కమిషనర్ డి.ఎం.సుక్తాంకర్ కార్యనిర్వాహక పాలన తర్వాత మళ్లీ 38 ఏళ్లకు ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధులు లేకుండా పాలన జరుగుతోంది. అయితే ఈసారి ఇది మరింత ఎక్కువ కాలం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధి, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో ఎన్నికలు నిర్వహించాలని పలువురు నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# రూ. ఒక లక్ష కోట్లు.. బీజేపీ వరాల జల్లు

**న్యూఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా మంగళవారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఢిల్లీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖను కూడా సీఎం రేఖ గుప్తానే పర్యవేక్షిస్తున్నారు. సీఎం రేఖా గుప్తా 202526 ఆర్థిక సంవత్సరానికి రూ. ఒక లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌ను సమర్పించారు. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ (Budget) కంటే ఈ బడ్జెట్ 31.5 శాతం అధికం. ఈ బడ్జెట్‌లో ఢిల్లీ ప్రజలకు బీజేపీ ప్రభుత్వం ఏఏ వరాలను అందించిందంటే..

**ఆరోగ్య బీమా**

ఢిల్లీ ప్రజలకు ఇకపై రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందుతుందని ముఖ్యమంత్రి రేఖ గుప్తా ప్రకటించారు. 'మహిళా సమృద్ధి యోజన' కోసం బడ్జెట్‌లో రూ.5,100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకం పరిధిలోకి వచ్చే ఢిల్లీలోని ప్రతి మహిళకు ప్రతీనెల రూ. 2,500 ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

**ఢిల్లీ బడ్జెట్‌లోని కీలక ప్రకటనలు**

మూలధన వ్యయం దాదాపు రెట్టింపు చేశారు. గత బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ. 15 వేల కోట్లుగా ఉండగా, ఈ బడ్జెట్‌లో దానిని రూ. 28 వేల కోట్లకు పెంచారు. త్వరలో ఢిల్లీలో ఆయుష్మాన్ యోజన అమలు. ఢిల్లీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ జన ఆరోగ్య యోజనకు అదనంగా మరో రూ. ఐదు లక్షలు జత చేస్తుంది. అంటే రూ. 10 లక్షల కవర్ అందుతుంది. ఈ పథకానికి ₹2144 కోట్లు కేటాయించారు. మహిళా సమృద్ధి యోజనకు రూ.5,100 కోట్లు కేటాయింపు. ప్రసూతి వందన పథకానికి రూ.210 కోట్లు. నీరు, విద్యుత్, రోడ్లు అభివృద్ధికి ప్రణాళికలు. ఢిల్లీ రోడ్డు రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి. ఎన్‌సీఆర్‌తో అనుసంధానం కోసం రూ.1,000 కోట్లు ఖర్చు. మహిళల భద్రత కోసం అదనంగా 50 వేల సీసీటీవీల ఏర్పాటు. జేజే కాలనీ అభివృద్ధికి రూ.696 కోట్లు కేటాయింపు. ప్రధానమంత్రి గృహ నిర్మాణ పథకానికి రూ.20 కోట్లు కేటాయింపు. 100 చోట్ల అటల్ క్యాంటీన్లు ఏర్పాటు. ఇందుకోసం రూ. 100 కోట్ల బడ్జెట్ కేటాయింపు. ఢిల్లీ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానంతో పాటు గిడ్డంగి విధానాన్ని అమలులోకి తీసుకురానుంది. సింగిల్ విండో వ్యవస్థ అమలు. పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధి. వ్యాపారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఢిల్లీలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణ.

# నీటితొట్టెలో పాముల ఫ్యామిలీ




**కర్ణాటక:** ఒక్క పామును చూస్తేనే హడలిపోతారు. ఇంకా ఎక్కువ పాములను చూస్తే ఎవరికైనా వణుకు పుట్టడం ఖాయం. ఇలాంటి ఘటనే శివమొగ్గ నగరంలో జరిగింది. కువెంపు లేఔట్‌లో ఈశ్వరయ్య అనే వ్యక్తి ఇంటిలో ఉన్న నీటి తొట్టిలో ఓ పాము గుడ్లను పెట్టి పొదిగింది. ఆదివారం తొట్టి బయట ఒక పాముపిల్లను చూసిన కుటుంబ సభ్యులు తొట్టెలో లైటు వేసి చూడగా పుట్టల కొద్దీ పాము పిల్లలు కనిపించడంతో భయపడిపోయారు. వెంటనే స్నేక్ కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. స్నేక్ కిరణ్ అప్పటినుంచి పాము పిల్లలను సేకరించసాగారు. సోమవారం నాటికి 69 పిల్ల పాములను పట్టి బకెట్లో నిల్వ చేశారు. వాటిని తీసుకెళ్లి దూరంగా ఓ చెరువులో వేశారు. కాగా ఈ వీడియోలు వైరల్ అయ్యాయి

# మోదీ కోసం ఛావా స్పెషల్ స్క్రీనింగ్

**న్యూఢిల్లీ:** బాలీవుడ్ లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఛావా''ను ప్రధాని నరేంద్ర మోదీ వీక్షించబోతున్నారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, ఎంపీల కోసం పార్లమెంట్‌లోనే ప్రత్యేకంగా ఈ చిత్రాన్ని ప్రదర్శించబోతున్నారు. మార్చి 27న పార్లమెంట్‌లోని బాలయోగి ఆడిటోరియంలో ఛావా సినిమాను ప్రదర్శించనున్నారు. ఈ స్క్రీనింగ్‌కి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకాబోతున్నట్లు సమాచారం. చిత్ర దర్శకుడితో పాటు తారాగణం కూడా హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని న్యూస్18 తన కథనంలో పేర్కొంది. బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ నటించిన చిత్రమే 'ఛావా. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు (Chhatrapati Shivaji Maharaj) శంభాజీ మహారాజ్(Sambhaji Maharaj) జీవిత కథ ఆధారంగా తెరకెక్కింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించగా.. దినేష్ విజన్ నిర్మించారు. రష్మిక మందన్నా, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం 2025 ఫిబ్రవరి 14న విడుదలై సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా.. కేవలం హిందీలోనే రూ.750 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేయగా.. భారీ వసుళ్లను సాధించింది. ఛావా సక్సెస్‌పై గతంలోనే ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరిలో జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి హాజరైన ఆయన.. ప్రస్తుతం దేశంలో ఛావా హవా కొనసాగుతోందంటూ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఛావా చిత్రానికి స్ఫూర్తినిచ్చిన నవల(ఛావా) రచయిత శివాజీ సావంత్‌కు ఈ ఘనతంతా దక్కుతుందని అభినందించారు.





# రాబిన్‌హుడ్ డెఫినెట్‌గా అందరికీ నచ్చుతుంది: హీరోయిన్ శ్రీలీల



హీరో నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ రాబిన్‌హుడ్. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ హై బడ్జెట్ తో నిర్మించారు. ఈ చిత్రంలో నట కిరీటి రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఆస్ట్రేలియా డైనమిక్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథి పాత్రలో నటించారు.. ఈ సినిమా మార్చి 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీలీల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**రాబిన్‌హుడ్ లో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఇందులో నా పాత్ర పేరు నీరా వాసుదేవ్. ఫారిన్ నుంచి ఇండియా వచ్చిన అమ్మాయిగా కనిపిస్తాను. తను తన సొంత ప్రపంచంలో ఉంటుంది. ఈ ప్రపంచమంతా తన చుట్టూనే ఉంటుందని అనుకుంటుంది. ఈ క్యారెక్టర్ చాలా క్యూట్ అండ్ బబ్లీగా ఉంటుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది.

**మొదట ఈ సినిమాకి రష్మిక గారిని అనుకున్నారు కదా.. తర్వాత మీరు ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

వరుస రిలీజ్ తర్వాత నా ఎడ్యుకేషన్ కోసం కొంత గ్యాప్ తీసుకోవాలని అనుకున్నాను. అలాంటి సమయంలో వెంకి గారు కాల్ చేశారు. నిజానికి రష్మిక గారికి చాలా నచ్చిన క్యారెక్టర్ ఇది. డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేదు. పుష్ప షూటింగ్లో కలిసినప్పుడు ఆల్ ది బెస్ట్ చెప్పారు. నాకు కూడా చాలా నచ్చి చేశాను.

**నితిన్ తో రెండోసారి కలిసి వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

నితిన్ తో వర్క్ చేయడం చాలా కంఫర్టబుల్ గా ఉంటుంది. చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఆయన ఫ్యామిలీ పర్సన్ లాగా ఉంటారు. సినిమాపై టీమంతా చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాం. మాకు చాలా టైం దొరికింది. చాలా క్వాలిటీతో ఈ సినిమాని ఆడియన్స్ ముసుకు తీసుకొస్తున్నాం. సినిమాని ఆడియన్స్ మంచి హిట్ చేస్తారనే నమ్మకం ఉంది. ఈ సినిమాతో నితిన్ గారు నాది హిట్ పెయిర్ అవుతుందనే నమ్మకం ఉంది.

**వెన్నెల కిషోర్ , రాజేంద్రప్రసాద్ ట్రాక్ గురించి?**

వెన్నెల కిషోర్ గారు రాజేంద్రప్రసాద్ గారి ట్రాక్ షూట్ చేస్తున్నప్పుడే పడి పడి నవ్వాము. ఇందులో వెన్నెల కిషోర్ గారి కామెడీని చాలా ఎంజాయ్ చేశాను. మా ఇద్దరి మధ్య వచ్చే సీన్స్ కూడా హిలేరియస్ గా ఉంటాయి. మొన్న సినిమా చూసినప్పుడు కూడా విపరీతంగా ఎంజాయ్ చేశాం. రాజేంద్రప్రసాద్ గారి గురించి మనం చెప్పాల్సిన అవసరం లేదు. ఇందులో కామెడీ అదిరిపోతుంది. ఇంత ఫన్ ఉన్న సినిమాని నా కెరీర్లో ఇప్పటివరకు చేయలేదు. నా కెరీర్లో కంప్లీట్ ఫన్ ఎంటర్టైనర్ గా నిలిచే సినిమా ఇది.

**మైత్రి మూవీ మేకర్స్ గురించి?**

నేను మైత్రి ఫ్యామిలీ లో ఉన్నానని చెప్పుకోవడం చాలా గర్వంగా ఉంటుంది. వారి బ్యానర్ లో నటించడం చాలా ఆనందంగా ఉంది. చాలా మంచి ప్రొడ్యూసర్స్. చాలా కంఫర్టబుల్ గా చూసుకుంటారు ఇంట్లో సినిమా చేస్తే ఎలా ఉంటుందో అంత హ్యాపీగా ఉంటుంది.

**వరుసగా సినిమాలు చేస్తున్న మీరు.. ఒక ఏడాది గ్యాప్ ఇవ్వడానికి కారణం?**

లాస్ట్ ఇయర్ నా నుంచి కంటిన్యూస్ గా దాదాపు ప్రతి నెలకి ఒక రిలీజ్ ఉండేది. ఒక్కొక్క రోజుకి 4, 5 షిఫ్టు పని చేశాను. అలా ప్లాన్ చేయడానికి కూడా కారణం నా ఫైనల్ ఇయర్ ఉంది కాబట్టి. ఎడ్యుకేషన్ లో ఫైనల్ ఇయర్ లో ఉన్నాను కాబట్టి ఆ గ్యాప్ ని ఫిల్ చేయడానికి అలా ప్లాన్ చేశాను. ఒక ఏడాది బ్రేక్ తీసుకుంటానని నాకు ముందు నుంచే అంచనా ఉంది. అయితే ఈ గ్యాప్ లో చాలా మంచి సినిమాలు చేయలేకపోయాను. చాలా సినిమాలు వదులుకున్నాను. ఇప్పుడు మెడిసిన్ పూర్తయింది. అయితే కాలేజీలో కొన్ని రూల్స్ ఉంటాయి. దానికి తగ్గట్టుగా అటెండ్ అవుతున్నాను.

**భగవంత్ కేసరి తర్వాత మీరు చేసే పాత్రలో చాలా మార్పులు ఉంటాయని భావించాం? ఫ్యూచర్లో అలాంటి క్యారెక్టర్స్ చేస్తారా?**

కచ్చితంగా. నేను చేసిన సినిమాల్లో క్యారెక్టర్ గుర్తుపెట్టుకోవడం చాలా అరుదు. కానీ భగవంత్ కేసరి తర్వాత అందరూ విజ్జి పాప అని పిలవడం మొదలుపెట్టారు. ఎక్కడికి వెళ్ళినా ఆ రెస్పాన్స్ అద్భుతం. అలా క్యారెక్టర్ పేరు గుర్తుపెట్టుకునే సినిమాలు చేయాలనేది ఉంది. కమర్షియల్ ఎంటర్టైనర్ సినిమాలు చేస్తూనే అలాంటి మంచి మెసేజ్ ఉన్న పాత్రలు, సినిమాలు చేయాలని భావిస్తున్నాను.

**మీరు బాలీవుడ్ లో కనిపించిన ప్రతిసారి మీరు అక్కడికి షిఫ్ట్ అయిపోతున్నారు ఏమో అని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి?**

తెలుగు ఇండస్ట్రీ నా ఇల్లు. బాలీవుడ్ కి వెళ్ళిపోవడం ఎప్పటికీ జరగదు. ఇంపాజిబుల్.

**కొత్తగా చేస్తున్న సినిమాలు?**

పరాశక్తి సినిమా చేస్తున్నాను. రవితేజ గారితో మాస్ జాతర చేస్తున్నాను. కన్నడతెలుగు లో జూనియర్ సినిమా చేస్తున్నా. ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. మేకర్స్ అనౌన్స్ చేస్తారు.

## ఘనంగా జయహో రామానుజ సినిమా సాంగ్స్ రిలీజ్ ఈవెంట్




లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "జయహో రామానుజ". ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్ లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్ గా నటిస్తుండగా..సుమన్, ప్రవల్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ చిత్ర సాంగ్స్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ముత్యాల రాందాస్ మాట్లాడుతూ లయన్ సాయి వెంకట్ నాకు మంచి మిత్రులు. ఆయన జయహో రామానుజ వంటి గొప్ప సినిమాను రూపొందించడం సంతోషంగా ఉంది. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, సంస్కృతంలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారంటే ఇది చిన్న సినిమా అనకూడదు. ఈ చిత్రాన్ని గ్రాండ్ గా రిలీజ్ చేయడంలో మా వంతు సపోర్ట్ చేస్తాం. జయహో రామానుజ సాయి వెంకట్ కు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా అన్నారు. దర్శకుడు, హీరో డా.లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ - మన తెలుగు రాష్ట్రాల్లో రామానుజాచార్యుల గురించి పెద్దగా తెలియదు. కానీ తమిళనాట ప్రతి ఒక్కరికీ ఆయన ఎవరో తెలుసు. చినజీయర్ స్వామి సమతామూర్తి విగ్రహాన్ని మన దగ్గర ప్రధాని, రాష్ట్రపతి వంటి పెద్ద వాళ్లు వచ్చి ఆవిష్కరించినప్పుడు తెలుగు రాష్ట్రాల వారికి బాగా ఆయన గురించి తెలిసింది. తెలుగు ప్రజలకు రామానుజాచార్యుల వారి గొప్పదనం తెలియజేసే ప్రయత్నంలోనే ఈ చిత్రాన్ని రూపొందించాను. వెంకటేశ్వర స్వామికే గురువు లాంటి వారు రామానుజులు. వెంకటేశ్వరుడికి శంఖు చక్రాలు రామానుజాచార్యుల వారే బహూకరించారు. కమల్ హాసన్ గారు సోషల్ మూవీలో 10 పాత్రలు చేశారు. కానీ పౌరాణికంలో ఎవరూ 11 పాత్రల్లో నటించలేదు. నేను "జయహో రామానుజ" చిత్రంలో 11 పాత్రలు చేసి వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేస్తున్నా. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయండి అని మిత్రులు ఇచ్చిన సలహాతో తెలుగు, తమిళ, మలయాళ,కన్నడ, హిందీ, సంస్కృతంతో పాటు మిగతా ప్రపంచ భాషల్లో రిలీజ్ చేయబోతున్నాం. త్వరలో ఓటీటీ కూడా ప్రారంభిస్తున్నాం. అన్నారు.

## స్టార్ హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా హోం టౌన్ ట్రైలర్ రిలీజ్



ఆహా సబ్ స్క్రైబర్స్ కోసం వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ హోం టౌన్. మన ఇంటి చుట్టు అల్లుకున్న జ్ఞాపకాలు, బంధాల నేపథ్యంతో ఈ వెబ్ సిరీస్ రూపొందింది. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి కీలక పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్ కు శ్రీకాంత్ రెడ్డి పల్లే దర్శకత్వం వహించారు. నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మించారు. ఏప్రిల్ 4వ తేదీ నుంచి హోం టౌన్ వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. మంగళవారం ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. హోం టౌన్ ట్రైలర్ తనకు బాగా నచ్చిందని చెప్పిన విజయ్.. వెబ్ సిరీస్ టీమ్ కు తన బెస్ట్ విశెస్ అందించారు. హోం టౌన్ వెబ్ సిరీస్ ట్రైలర్ ఎమోషన్, ఎంటర్ టైన్ మెంట్ తో ఆకట్టుకుంది. ఉపాధి కోసం సొంతూర్లను వదిలి వచ్చినా, ఆ జ్ఞాపకాలను మాత్రం మర్చిపోలేం. మళ్లీ ఆ జ్ఞాపకాలను గుర్తు చేసేలా ట్రైలర్ ఉంది. జ్యోతి ఫొటో స్టూడియో జీవనోపాధిగా ఉన్న రాజీవ్ కనకాల..తన కొడుకు శ్రీకాంత్ (ప్రజ్వల్ యాద్మ)ను విదేశాల్లో చదివించి గొప్ప స్థాయిలో చూడాలనుకుంటాడు. కానీ శ్రీకాంత్ ఫ్రెండ్స్ తో సరదాగా గడిపే ఓ సగటు మధ్య తరగతి కుర్రాడు, అతనికి చదువుల మీద శ్రద్ధ ఉండదు. ఇక్కడే కుటుంబంలో సంఘర్షణ ఏర్పడుతుంది. తండ్రి కోరుకున్నట్లు శ్రీకాంత్ విదేశాల్లో చదివేందుకు ఒప్పుకున్నాడా లేదా, కొడుకును విదేశాల్లో చదివించేందుకు మధ్య తరగతి తండ్రి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు అనేది హోం టౌన్ వెబ్ సిరీస్ ట్రైలర్ లో ఆసక్తికరంగా చూపించారు. ఝాన్సీ, అనీ, రాజీవ్ కనకాల, ప్రజ్వల్ యాద్మ తమ పర్ ఫార్మెన్స్ లతో ఆకట్టుకున్నారు. ఈ సిరీస్ కు దేవ్ దీప్ గాంధీ కుండు సినిమాటోగ్రాఫర్ కాగా...సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS




## పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్

**మహా:** ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. ఈ మెగా ఈవెంట్ లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన హై స్కోరింగ్ థ్రిల్లర్‌లో 11 పరుగుల తేడాతో పంజాబ్ విజయం సాధించింది. 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టీమ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. గుజరాత్ బ్యాటర్లలో సాయిసుదర్శన్(74), జోస్ బట్లర్(54) రూథర్ ఫర్డ్(46) పోరాడినప్పటకి తమ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్(33) తన వంతు ప్రయత్నం చేశాడు. కానీ కొండంత లక్ష్యాన్ని కరిగించలేకపోయారు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ రెండు, జానెసన్, మాక్స్‌వెల్ తలా వికెట్ సాధించారు.

**శ్రేయస్ అయ్యర్ విధ్వంసం..**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్( 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సలతో 97) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అయ్యర్‌తో పాటు శశాంక్ సింగ్(16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలతో 44), ప్రియాన్ష్ ఆర్య(47) మెరుపులు మెరిపించారు. గుజరాత్ బౌలర్లలో సాయికిషోర్ మూడు వికెట్లు పడగొట్టగా.. రషీద్ ఖాన్, రబాడ తలా వికెట్ సాధించారు. శ్రేయస్ అయ్యర్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది.



## మాక్స్‌వెల్ అత్యంత చెత్త రికార్డు

ఐపీఎల్ 2025 సీజన్‌ను పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ పేలవంగా ఆరంభించాడు. ఈ టోర్నీలో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మాక్స్‌వెల్ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. స్పిన్నర్ సాయి కిషోర్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ప్రయత్నించి వికెట్ల ముందు మాక్స్‌వెల్ దొరికిపోయాడు. ఒకవేళ మాక్సీ రివ్యూ తీసుకుని ఉండి ఉంటే ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకునేవాడు. ఎందుకంటే బంతి రిప్లేలో వికెట్స్‌ను మిస్ అవుతున్నట్లు తేలింది. తర్వాత డగౌట్ నుంచి రిప్లే చూసిన మాక్సీ షాకయ్యాడు. ఇక ఈ మ్యాచ్‌లో డకౌటైన మాక్స్‌వెల్ అత్యంత చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యధిక డకౌట్‌లు అయిన ఆటగాడిగా మాక్స్‌వెల్ నిలిచాడు. ఈ ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ ఐపీఎల్‌లో ఇప్పటివరకు 19 సార్లు డకౌటయ్యాడు. ఇంతకు ముందు ఈ చెత్త రికార్డు సాధించిన జాబితాలో రోహిత్ శర్మ(18), దినేష్ కార్తీక్(18)లో కలిసి మాక్సీ సంయుక్తంగా ఉన్నాడు. ఇప్పుడు తాజా మ్యాచ్‌తో ఈ చెత్త రికార్డును తన ఒక్కడి ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్( 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సలతో 97) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. గుజరాత్ బౌలర్లలో సాయికిషోర్ మూడు, రబాడ, రషీద్ ఖాన్ తలా వికెట్ సాధించారు.

## ఓటమి బాధలో ఉన్న పంత్ టీమ్‌కు అదిరిపోయే న్యూస్..



ఐపీఎల్ 2025ను లక్నో సూపర్ జెయింట్స్ ఓటమితో ఆరంభించిన సంగతి తెలిసిందే. సోమవారం(మార్చి 24) వైజాగ్ వేదికగా జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో ఒక్క వికెట్ తేడాతో అనూహ్యంగా ఓటమి పాలైంది. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని లక్నో బౌలర్లు కాపాడుకోలేకపోయారు. తొలి 10 ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేసినప్పటి.. ఆఖరి 10 ఓవర్లలో లక్నో బౌలర్లు తేలిపోయారు. ఢిల్లీ ఆటగాడు అశుతోష్ శర్మ(31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులతో 66 పరుగులు) తన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో లక్నో నుంచి మ్యాచ్ లాగేసుకున్నాడు. ఇక లక్నో సూపర్ జెయింట్స్ తమ తదుపరి మ్యాచ్‌లో మార్చి 27న ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు లక్నోకు ఓ గుడ్‌న్యూస్ అందింది. లక్నో సూపర్ జెయింట్స్ శిబిరంలో చేరడానికి స్టార్ పేసర్ అవేష్ ఖాన్‌కు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫిట్ సర్టిఫికేట్ ఇచ్చింది. మోకాలి గాయంతో బాధపడుతున్న అవేశ్ ఖాన్ ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావసం పొందుతున్నాడు. దీంతో అతడు ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో లక్నో ఆడే తొలి మూడు మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు వార్తలు వినిపించాయి. కానీ త్వరగా కోలుకున్న అవేష్ ఖాన్.. మార్చి 24(సోమవారం) నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో పాసైనట్లు తెలుస్తోంది. దీంతో అతడు అనుకున్న దానికంటే ముందుగానే లక్నో జట్టుతో చేరనున్నాడు. కాగా ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో అవేష్ లేని లోటు లక్నో జట్టులో కన్పించింది. మరోవైపు లక్నోను గాయాల బెడద వెంటాడుతోంది. స్టార్ పేసర్ మోషిన్ ఖాన్ గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌కు ఇప్పటికే దూరం కాగా.. రూ. 11 కోట్లు వెచ్చించి రిటైన్ చేసుకున్న మయాంక్ యాదవ్ టోర్నమెంట్ మొదటి అర్ధభాగానికి దూరమయ్యే అవకాశం ఉంది. వీరిద్దరితో పాటు ఆకాష్ దీప్ మరో రెండు మ్యాచ్‌లు దూరమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ క్రమంలో అవేష్ ఖాన్ గాయం నుంచి కోలుకోవడం లక్నోకు భారీ ఊరట కలిగించింది అనే చెప్పాలి. కాగా మోషిన్ ఖాన్ స్థానంలో స్టార్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌తో లక్నో ఒప్పందం కుదుర్చుకుంది.

## సెల్ఫ్‌లెస్ శ్రేయస్ అయ్యర్.. జట్టు కోసం సెంచరీ త్యాగం



ఐపీఎల్ 2025ను పంజాబ్ కింగ్స్ కెప్టెన్, టీమిండియా స్టార్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ ఘనంగా ఆరంభించాడు. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన శ్రేయస్ అయ్యర్ ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే బౌండరీల వర్షం కురిపించాడు. అతడి ఆపడం ఎవరి తరం కాలేదు. అయితే అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన శ్రేయస్ అయ్యర్ తన తొలి ఐపీఎల్ సెంచరీ మాత్రంను అందుకోలేకపోయాడు. సెంచరీకి మూడు పరుగుల దూరంలో అయ్యర్ నిలిచిపోయాడు. ఈ ముంబైకర్ 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సలతో 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

**'సెల్ఫ్‌లెస్ శ్రేయస్ అయ్యర్'**

కాగా ఈ మ్యాచ్‌లో అయ్యర్‌కు సెంచరీ చేసే అవకాశమున్నప్పటికి.. జట్టు ప్రయోజనం కోసం నాన్ స్ట్రైక్‌లోనే ఉండిపోయాడు. తన సెంచరీ కంటే జట్టుకు పరుగులు రావడమే ముఖ్యమని అయ్యర్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఆఖరి ఓవర్‌లో స్ట్రైక్ అంటిపెట్టుకునే ఛాన్స్ వచ్చినప్పటికి అయ్యర్ మాత్రం రెండో పరుగుకు పరిగెత్తి శశాంక్ సింగ్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. నా సెంచరీ కోసం ఆలోచించకు నీవు హిట్టింగ్ చేయు అని శశాంక్‌కు అయ్యర్ పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. దీంతో శశాంక్ ఏకంగా ఆఖరి ఓవర్‌లో 23 పరుగులు రాబట్టాడు. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఈ క్రమంలో సెల్ఫ్‌లెస్ ఇన్నింగ్స్ ఆడిన అయ్యర్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## ఎయిర్ పోర్టు , కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, గ్రీన్ ఫీల్డ్ తదితర అంశాల పై సమీక్ష

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మామునూరు ఎయిర్ పోర్టు , కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, గ్రీన్ ఫీల్డ్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన పనులకు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని కార్యాచరణ ప్రణాళిక పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ ఏనుమాముల, గీసుకొండ, ఖిలావరంగల్ ఇన్నర్ రింగ్ రెండు పనులలో భూమి కోల్పోయిన రైతుల భూములను అవార్డింగ్ పాస్ అయిన వారికి డబ్బులు చెల్లించుటకు సిద్ధంగా ఉన్నామని ఆ పనులు పూర్తి చేసే ప్రక్రియలో ఆర్డీవో వరంగల్ ను ఆదేశించనైనది. ఎయిర్పోర్ట్ నిర్మాణం పనుల లో ఖిల వరంగల్ లోని నక్కల పల్లి,గాడిపల్లి లలో సర్వే పూర్తి అయిందని పనులు పురగతి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకతీయ మేఘ టెక్స్టైల్ పార్కు లో గ్రీన్ కవరేజీ ఏర్పాటు చేయాలని వారంలోగా 15000 మొక్కలు నాటి వాటికి జియో ట్యాగింగ్ ఏర్పాటు చేసి సర్వైవ్ అయ్యేలా చూడాలని జీఎం,ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. ఎంప్లాయిమెంట్ జెనరేట్ చేయుటకు జాబ్ మేళా నిర్వహించి గీసుకొండ సంగెం మరియు వరంగల్లులో 18నుండి 39సంవత్సరాలు లోనిరుద్యోగులనుగుర్తించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంప్లాయిమెంట్ అధికారిణి ఆదేశించారు. అలాగే కుట్టు శిక్షణ కేంద్రాలలో శిక్షణ ఇప్పించి నాణ్యత ప్రావీణ్యత కలిగిన వారిని ఎంపిక చేయాలని డి ఆర్ డి ఓ పిడీ నీ ఆదేశించడమైనది. నేషనల్ హైవే పనులలో నర్సంపేట లోని , గీసుకొండ , సంగెం, చింత నెక్కొండ లో ల్యాండ్ ఎక్విజేషన్ పనులకు అవార్డు పాస్ చేసేందుకు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు వరంగల్ సత్యపల్ రెడ్డి,నర్సంపేట ఉమారాణి , సంబంధిత తహసీల్దార్లు, నాగేశ్వరరావు, ఇక్బాల్, రాజ్ కుమార్, రియజుద్దీన్, వెంకట్ స్వామి ,ఆర్ అండ్ బి ఈ ఈ జితేందర్ రెడ్డి , ఇరిగేషన్ ఈ ఈ రామకృష్ణ , నేషనల్ హైవే అధికారి, ఇండస్ట్రీ అధికారి రమేష్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పైలెట్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

**రంగారెడ్డి జిల్లా, మహా :** పవిత్రమైన రంజాన్ మాసం పురస్కరించుకొని తాండూరు మాజీ శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్ లో మంగళవారం ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు తాండూరు నియోజకవర్గ మండలాలు, గ్రామాల నుండి వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు సోదరులు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విందు ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లిం మత పేదలను, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పైలెట్ విఠల్ రెడ్డి, శ్రీశైల రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## "సబ్ కి యోజన - సబ్ కి వికాస్" అమలుకు ప్రణాళికలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాటారం, మహా :** జిల్లాలో సమగ్ర ప్రణాళికా అమలుకు సంబంధించి "సబ్ కి యోజన సబ్ కి వికాస్" కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సబ్ కి యోజన సబ్ కి వికాస్" కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపకల్పనపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ప్రణాళికల రూపకల్పనపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా మరియు మండల స్థాయిలో ప్రణాళికా రూపకల్పన ఎంతో కీలకమైనదని, ఇందులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచి ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, స్థానిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు.

**త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి**

వేసవిలో త్రాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను అదేశించారు. మంగళవారం ఐడిఓసికార్యాలయంలోని సమావేశ మందిరంలో త్రాగునీరు, సాగు నీరు, ఉపాధి హామీ పథకం అమలు,ఎల్ ఆర్ ఎస్,ఇంటి పన్నులు వసూలు ,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డుల మంజూరు తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎం.పీ.డి.ఓ లు, ఎంపీఓ లు, ఏ పీఓ లు,మిషన్ భగీరథ ఏ.ఈ లు, డి.ఈ లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాలలో అధికారులు క్షేత్రస్థాయిలోపంచాయితీ సెక్రటరీల ద్వారా పరిశీలించి నివేదికలు తయారు చేసి అందించాలి, మండల స్థాయిలో అధికారులు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి త్రాగు నీటి సమస్య లాపి నివేదికలు అందించాలని తెలిపారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను అందించాలని ఎక్కడైనా త్రాగు నీటి సమస్య తలెత్తితే అధికారులు ముందుగానే ప్రజలకు తెలియజేయాలి అని గ్రామాలలో బోర్లు,చేతి పంపులు పని తీరును పరిశీలించాలని సమస్యలు ఉన్న చోట మరమ్మత్తులు చెయ్యినచాలను పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ నారాయణరావు, డిఆర్డీఓ నరేష్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు , ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు, వెండి నాణ్యతపై అవగాహన



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో బిఐఎస్ కేర్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో జ్యువెలర్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఐఎస్ సంస్థ ప్రతినిధులు శాస్త్రి, ప్రశాంతి, రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో హాల్‌మార్క్, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన బంగారం, వెండి నాణ్యత పరీక్షల గురించి వివరణ ఇచ్చారు. ఈ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను మోత్కూరు మండల స్వర్ణకార సంఘం నిర్వహించగా, ఆత్మకూరు, గుండాల, అడ్డగూడూరు మండలాల నుంచి స్వర్ణకారులు హాజరయ్యారు. స్వర్ణకారులకు నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పిస్తూ, నకిలీ ఆభరణాల నుంచి ఎలా రక్షణ పొందాలో తెలియజేశారు.

## మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి 20వేల లీటర్ల మంచినీరు

- రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్.. హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ కు వినతిపత్రం



**రంగారెడ్డి జిల్లా, మహా :** ప్రతి ఇంటికి మంచినీటిని ఉచితంగా అందజేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ కు, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్, తుర్కయంజాల్ మునిసిపల్ బిజెపి శాఖ ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ... జిహెచ్ఎంసి పరిధిలో 20వేల లీటర్లు మంచి నీరు ప్రతి ఇంటికి ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని, అదే విధంగా తుర్కయంజాల్ మునిసిపాలిటీలో కూడా జీవో 211 ప్రకారం ప్రతి ఇంటికి 20వేల లీటర్లు మంచినీరు ఉచితంగా సరఫరా చేయాలని మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారి త్వరలోనే మంచినీరు సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సహకార బ్యాంకు వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, బిజెపి ఎస్సీ మోర్చా కోశాధికారి బాచిగాళ్ళ రమేష్, బల్దేవ్ రెడ్డి, ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ కొండ్రు పురుషోత్తం, సామల యూసుఫ్ రెడ్డి, బిక్షపతి, సంజీవ రెడ్డి, మైలారం బాబు, దార వెంకటేష్, సురేష్, కోలన్ రవీందర్ రెడ్డి, గుండా కృష్ణ, సురేష్ సాగర్, యటెల్లి శేఖర్ రెడ్డి, పిట్టల వంశీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## సహచరులకు సహాయం చేయడమే నేరమా?



- ఇజ్రాయిల్ హత్యతో బగ్గుమన్న న్యాయవ్యవస్థ
- న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటి?
- బార్ అసోసియేషన్ న్యాయవాదులు
- ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నిరసనలు

**రంగారెడ్డి జిల్లా, మహా :** సహచరులకు సహాయం చేయడమే నేరమా అంటూ, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని న్యాయవాదులు, అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సోమవారం ఐఎస్ సదన్ లో న్యాయవాది యెర్రబాపు ఇజ్రయిల్ పై దాడి చేసి హత్య చేయడాని నిరసిస్తూ చౌరస్తాలో న్యాయవాదుల నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన, ఇజ్రాయిల్ న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. తన ఇంటిలో కిరాయికి ఉంటున్న మహిళను వ్యక్తి వేధిస్తున్నాడని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడాని ఆగ్రహించిన వ్యక్తి అతి కిరాతకంగా కథలతో దాడి చేసి హతమార్చాడు. సదరు మహిళలకు సహాయం చేయడమే నేరమా అంటూ, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని బార్ అసోసియేషన్ న్యాయవాదులు, అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ, ఇజ్రాయిల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, నిరసన తెలిపారు. అడ్వకేట్ల రక్షణ కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రత్యేకంగా చట్టం తెచ్చి రక్షణ కల్పించాలని కోరారు. ఇటీవల అడ్వకేట్ల పై హత్యల నేపథ్యంలో రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని అడ్వకేట్లు డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థలో ఉన్న అడ్వకేట్ లకే రక్షణ కరువైపోయిందని, సామాన్య పరిస్థితి ఎలా ఉంటుందని అడ్వకేట్లు అసహనం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ లాంటి న్యాయవాది సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిని హత్య చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందుతుందని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాన్ని న్యాయవాదుల రక్షణ చట్టం చేసి అమలు చేయాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు.

## విద్యుత్ షాక్ తో హెల్పర్ కు తీవ్ర గాయాలు



**ములుగు, మహా :** ట్రాన్స్ ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా హెల్పర్ కు షాక్ కొట్టి తీవ్ర గాయాలైన సంఘటన ములుగు మండలం కొడిశెల కుంట సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రు తండాకు చెందిన బానోతు యాకూబ్ నాయక్ ప్రైవేటు హెల్పర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం సబ్స్టేషన్ పరిధిలోని ఓ ట్రాన్స్ ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా ఆన్ఆఫ్ స్విచ్ బంద్ చేసి పని ప్రారంభించారు. ఈ క్రమంలో 11కేవీ విద్యుత్ వైరు తగిలి షాక్ కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే హన్మకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. యాకూబ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ ప్రాంతంలో సీనియర్ హెల్పర్ గా విద్యుత్ పనులు చేస్తున్న యాకూబ్ ఎల్సీ తీసుకోకుండానే పని ప్రారంభించినట్లుగా చర్చ జరుగుతోంది. ఈ సంఘటనపై విద్యుత్ అధికారులు విచారణ చేపట్టారు.

## ఆకస్మికంగా పన్ను వసూళ్ల తీరును

### పరిశీలించిన కమిషనర్




**వరంగల్ మహా :** గ్రేటర్ వరంగల్లో పన్నుల వసూళ్ల తీరును కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం రాత్రి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పన్నులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. పన్నుల చెల్లింపునకు గడువు సమీపిస్తున్న తరుణంలో నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోవడానికి కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని హంటర్ రోడ్ నక్కల గుట్ట బాల సముద్రం హన్మకొండ బస్ స్టాండ్ రోడ్ ప్రాంతాల్లో పరిశీలించి పలువురు నగర వాసుల నుండి పన్నులు స్వీకరించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికీ పన్నులు చెల్లించని రెసిడెన్షియల్ కమర్షియల్ బడా బకాయి దారులకు నోటీసు లతో పాటు చాల కాలం పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు అందించడం తో పాటు చెల్లించని వారి ప్రాపర్టీ లు సీజ్ చేశామని కావున పన్నులు చెల్లింపుకు కేవలం 5 రోజులే గడువు మిగిలిఉన్నందున నగర వాసులు వెంటనే వారు బల్దియా కు బకాయి పడి ఉన్న ఆస్తి నల్లా పన్నులు వెంటనే చెల్లించాలని లేకుంటే ఆస్తులను జప్తు చేస్తామని కమిషనర్ అన్నారు.

పన్ను వసూళ్ల నేపథ్యం లో హన్మకొండ బస్ స్టాండ్ సమీపం లో గల శ్రేయ లాడ్జ్ యాజమాన్యం వారు బల్దియా కు బకాయి పడి ఉన్న ఆస్తి పన్ను రూ.2 లక్షల 40 వేల చెక్ ను కమిషనర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ లు రవీందర్, రాజేశ్వర్, ఆర్ ఓ యూసూఫొద్దిన్, ఆర్ ఐ లు శ్రీకాంత్, దేవరాజు, వార్డు ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయలలో ఆకస్మితంగా తనిఖీ చేసిన

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు





**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఎమ్మార్వో కార్యాలయాన్ని, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రి పనితీరును పరిశీలించిన ఆయన, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో మెడిసిన్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని, వైద్యాధికారులు మరింత బాధ్యతగా పని చేసి ప్రజల్లో నమ్మకం పెంచాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లడంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్యులు నిబద్ధతతో సేవలందించాలని సూచించారు. ప్రజలు తమ ఆరోగ్య చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయకుండా, ప్రభుత్వ వైద్యసేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో కంప్లైంట్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామని, వైద్యులు నిర్లక్ష్యం చేస్తే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్ద పెద్ద వైద్యులు అందుబాటులో ఉంటారని, మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.అనంతరం ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రజలకు అందాల్సిన సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలని, ప్రత్యేకంగా తీవ్రంగా బాధపడుతున్న గ్రామాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్లు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పాటిమట్ల గ్రామంలో 45 ఇండ్లు మంజూరయ్యాయని, 15 ఇండ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. నిర్మాణ పనులకు ఇసుక మెటీరియల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మార్వో సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎంపీడీవో లను ఉద్దేశించి ఎల్ఆర్ఎస్ విధానంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ విషయమై, మున్సిపాలిటీలో 3,650 దరఖాస్తులు ఉండగా 390 మంది రెగ్యులరైజేషన్ కోసం చెల్లించాల్సిన ఫీజును చెల్లించారని తెలిపారు. రూరల్ ప్రాంతాల్లో 202 మంది చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 19 మాత్రమే రెగ్యులరైజేషన్ పూర్తి చేసుకున్నారని చెప్పారు. ఎల్ఆర్ఎస్ చెల్లించి ప్లాట్ రెగ్యులరైజేషన్ చేసుకున్న లబ్ధిదారునికి అధికార పత్రాన్ని అందజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్ చేయించుకున్న వారికి, 25% రాయితీ లభిస్తుందని అన్నారు. మున్సిపల్ కేంద్రంలో టాక్స్ వసూలు ఇప్పటివరకు, 90% వసూలైన, 100% పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నం

### అభివృద్ధిలో మాకు పార్టీ బేషజాలు లేవు అంటూ సురేఖ కీలక వ్యాఖ్యలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య భక్తులకు దృష్టిలో పెట్టుకుని దేవాలయాల్లో కనీస సౌకర్యాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. దేవాలయాల అభివృద్ధి విషయంలో తమకు ఆ పార్టీ... ఈ పార్టీ అంటూ ఎటువంటి భేషజాలు లేవని గుర్తు చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అనేక పనులను పూర్తి చేసేందుకుగాను కట్టుదిట్టంగా కార్యాచరణ ప్రణాళికలను అమలుచేస్తున్నామన్నారు. విజయవంతంగా జాతరల నిర్వహణ చేసినట్టు చెప్పారు. ప్రజల నమ్మకాలు, విశ్వాసాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో ప్రధాన పండుగలైన సమ్మక్క, సారాలమ్మ జాతర, బోనాల జాతరను ప్రభుత్వం విజయవంతంగా చేపట్టామన్నారు. తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతిగాంచిన సమ్మక్కసారాలమ్మ జాతరను ప్రభుత్వం ఈసారి ప్రభుత్వం వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. ప్రతి రెండేళ్ళకోసారి నిర్వహించే ఈ జాతరను ఈ యేడాది 21 ఫిబ్రవరి 2024 నుంచి 24 ఫిబ్రవరి 2024 వరకు విజయవంతంగా నిర్వహించిందన్నారు. జాతర నిర్వహణకు గాను రూ.110.00 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బోనాల పండుగ అని... గ్రామ దేవతలకు బోనం రూపంలో నైవేద్యం సమర్పించడం ఈ పండుగ ప్రత్యేకత ఉందన్నారు. గ్రామ దేవతలకు నిర్వహించే ఈ పండుగను హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోఘనంగా నిర్వహించామన్నారు. హైదరాబాద్ సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరిలోని ప్రధాన దేవాలయాలతో పాటు ఇతర దేవాలయాల్లో బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసిందన్నారు. కాగా గత ఏడాది ప్రభుత్వం రూ. 15 కోట్లను మాత్రమే ఖర్చు చేసిందన్నారు. 07.07.2024 నుండి గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారికి బోనాల సమర్పణతో ప్రారంభమైన బోనాల జాతర 29.07.2024 న శ్రీ అక్కన్న మాదన్న దేవాలయంలో ఏనుగు అంబారీ ఊరేగింపు, ఘటముల ఊరేగింపు, నిమజ్జనాలతో ముగిసిందన్నారు. ఈ యేడాది బోనాల నిర్వహణ నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛైర్మన్ గా రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటి ఏర్పాటైందన్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, రాజ్యసభ ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యులుగా, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులు/కన్వీనర్ గా మొత్తంగా ఏడుగురితో కూడిన కమిటి బోనాల ఉత్సవ నిర్వహణా బాధ్యతలను చేపట్టిందన్నారు.

**సామూహిక కార్తీక దీపోత్సవం**

తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా దేవాదాయశాఖ కార్తీక మాసంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరివేసేలా 'సామూహిక కార్తీకమాస దీపోత్సవ వేడుకలు' వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. 2 నవంబర్ 2024 నుండి 1 డిసంబర్ 2024 వరకు ఈ వేడుకలను దేవాదాయ చేపడుతున్నదన్నారు. ఇందుకు సంబంధించి దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లో కార్తీకమాస దీపోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించేలా కార్యనిర్వహణాధికారులు, అసిస్టెంట్ కమిషనర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు దేవాదాయశాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లో సామూహిక కార్తీక దీపోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. దేవాదాయ శాఖ సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు రెండు మట్టి ప్రమిదలు, నూనె, వత్తులు ఉచితంగా అందిస్తున్నదన్నారు. కార్తీక మాసంలో వచ్చే నాలుగు కార్తీక సోమవారాల్లో ప్రతి కార్తీక సోమవారం తాను కూడా మంత్రిగా ఏదో ఒక దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఇలా గడిచిన రెండు సోమవారల్లో మొదటి సోమవారం కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో, రెండవ సోమవారం భద్రకాళి దేవాలయంలో మంత్రి సురేఖ కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నానని చెప్పారు. సామూహిక కార్తీక దీపోత్సవం విశేషాలు

- కార్తీక మాస దీపోత్సవ వేడుకలకు హాజరయ్యే మహిళా భక్తులకు ఉచితంగా పసుపు కుంకుమ అందిస్తామని చెప్పారు.
- ప్రధాన దేవాలయాల్లో మహిళా భక్తులకు బ్లౌజ్ పీస్ ల అందజేసినట్టు చెప్పారు.
- ప్రతిరోజు సాయంత్రం సామూహిక దీపోత్సవ సమయంలో ప్రత్యేక ప్రసాద పంపిణీ చేసినట్టు వివరించారు.
- సంబంధిత దేవాలయానికి చెందిన నిధులు, దాతల సహకారం ద్వారా ఇతర కార్యక్రమాల నిర్వహించామన్నారు.
- ప్రతిరోజు సాయంత్రం స్థానిక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించామన్నారు.
- కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజులను పురస్కరించుకుని మొత్తంగా కార్తీక మాసంలో ఐదు రోజులపాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. స్థానిక కళాకారులతో పాటు, రాష్ట్ర, రాష్ట్రేతర ప్రముఖ కళాకారులతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రవచనాలు, భజనలు, కీర్తనలు, భక్తి పాటలు, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, బుర్రకథ, హరికథ తదితర కార్యక్రమాలను దేవాదాయ శాఖ చేపడుతున్నదన్నారు.
- కార్తీకదీపాలను వదిలేందుకు నీటి కొలనుల ఏర్పాటు చేశామన్నారు.
- భక్తి ఛానల్, ఎఫ్ఎం రేడియో తదితర సమాచార సాధనాల ద్వారా కార్తీక మాస దీపోత్సవ వేడుకల ప్రచారం చేశామన్నారు.
- అవకాశమున్నచోట ప్రత్యేక 'నది హారతి' కార్యక్రమాల నిర్వహణ చేపడుతున్నట్టు వివరించారు.
- టీజీ ఆర్టీసీ సహకారంతో ప్రత్యేక రవాణా సదుపాయ కల్పన కృషి చేసినట్టు చెప్పారు.
- కార్తీక మాస దీపోత్సవ వేడుకల నిర్వహణ సందర్భంగా అభిషేకాలు, హోమాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు వంటి ప్రత్యేక పూజల నిర్వహించినట్టు వెల్లడించారు.

## చౌల్ల రామారం అడ్డగూడూరు స్టేజ్ వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్ళ రామారం అడ్డ గూడూరు స్టేజి వద్ద తొర్రూరు వలిగొండ నేషనల్ హైవే పైన నడిపే బస్సులు అడ్డగూడూరు స్టేజి వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దాదాపు గంట రాస్తారోకో నిర్వహించడం జరిగింది అనంతరం ఫోన్లో మాట్లాడిన అడ్డగూడూరు ఎస్సై డి నాగరాజు, సూచన మేరకు బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని రాస్తారోకో ముగించిన విద్యార్థి నాయకులు, ఈ సందర్భంగా ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ అడ్డగూడూరు స్టేజి వద్ద గతంలో ఎక్స్ప్రెస్ ఆర్డినరీ డీలక్స్ బస్సులు ఆపేవారని మహాలక్ష్మి ఫ్రీబస్ పథకం వచ్చినప్పటినుండి అడ్డగూడూరు స్టేజి వద్ద బస్సులను ఆపకపోవడంతో ప్రయాణికులు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, దాదాపు మండలంలోని అన్ని గ్రామాలు గట్టుసింగారం మానాయికుంట గోవిందపురం అడ్డగూడూరు ధర్మారం లక్ష్మీదేవి కాలువ ప్రజలు విద్యార్థులు అడ్డగూడూరు స్టేజి వద్దకు వచ్చి హైదరాబాద్ వెళ్లడానికి ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తుంటారు బస్సులు ఇక్కడ స్టేజ్ వద్ద ఆపకపోవడంతో దాదాపు కిలోమీటర్ మేర నడవాల్సిన పరిస్థితి ఉందని ఇలాంటి పరిస్థితులు రాకుండా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రత్యేక చొరవ తీసుకొని అడ్డగూడుర్ స్టేజి వద్ద ఆర్టిసి బస్సులు ఆపటానికికృషిచేయగలరనివిజ్ఞప్తిచేస్తున్నామన్నారు ఐక్య విద్యార్థి సంఘాలు ఎస్ ఎస్ యు నాయకులు చిప్పలపల్లి వంశీ కుమార్, చెరుకు శివరాజు, జిల్లా రాకేష్, సంతోష్, బిఆర్ఎస్ నాయకులు, ఎడ్ల ప్రేమ్ కుమార్, మేడబోయిన రాజు ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉప్పల వంశీ, మందుల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.